ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
16
బుధవారం 16 ఆగస్టు 2017


స్వాతంత్ర్య వేడుకల్లో గిరిజనుల సంప్రదాయ నృత్యం



ప్రభుత్వ పథకాలు

దేశానికే ఆదర్శం

- అన్ని రంగాల్లో భద్రాద్రిని అగ్రస్థానంలో నిలుపుతాం
- 'కాకతీయ'తో 13 వేల ఎకరాలకు సాగునీరు
- 'భగీరథ'తో ఇంటింటికీ తాగునీరు
- యుద్ధప్రాతిపదికన 'డబుల్' నిర్మాణాలు
- హరితహారం మొక్కలకు జియోట్యాగింగ్
- స్వాతంత్ర్య వేడుకల్లో ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు
- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాల అందజేత

'రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. మిషన్ కాకతీయతో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. 'భగీరథ' ద్వారా ఇంటింటికీ తాగునీరు అందజేస్తాం. కొత్తగా ఏర్పడిన జిల్లా అభివృద్ధికి రూ. వందల కోట్లు మంజూరు చేస్తున్నాం. భద్రాద్రి కొత్తగూడేన్ని అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలుపుతామని' ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు పేర్కొన్నారు. మంగళవారం కొత్తగూడెం ప్రగతి మైదానంలో నిర్వహించిన 71వ స్వాతంత్ర్య వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ జెండాను ఎగరేశారు. పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

-ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం

11

చిత్రాలు సెంటర్‌స్ప్రెడ్‌లో...


ప్రసంగిస్తున్న మంత్రి పద్మారావు


ప్రగతి మైదానంలో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి పద్మారావు


ఖమ్మంలో జెండాకు వందనం చేస్తున్న మంత్రి తుమ్మల

అభివృద్ధి, సంక్షేమంలో జిల్లా అగ్రగామి

- 'సీతారామ'తో జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- ఆర్‌అండ్‌బీ మంత్రి మంత్రి తుమ్మల
- ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ
- అలరించిన శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు

11


ప్రసంగిస్తున్న సింగరేణి సీఎండీ శ్రీధర్

బొగ్గు ఉత్పత్తిలో

సింగరేణి నంబర్‌వన్

- వచ్చే ఐదేళ్లల్లో 25 కొత్తగనుల ప్రారంభం
- స్వాతంత్ర్య వేడుకల్లో సింగరేణి సీఎండీ శ్రీధర్

7

మందు.. జెండావందనం బందు!

- మద్యం తాగి.. ఆపై స్వాతంత్ర్య దినం మరచి..
- అచుతాపురం అటవీరేంజర్ నిర్వాకం
- జెండా ఎగరేయ కుండానే ఇంటికి..


మద్యం తాగుతున్న రేంజర్

6

ఇదేనా కార్పొరేట్ వైద్యం?

- మురిపించారు.. మూసేశారు
- నియామకం కాని వైద్యులు, సిబ్బంది
- 25 రోజులుగా సముదాయాలకు తాళాలు వేసి ఉన్నవైనం
- భద్రాద్రి ఏరియా వైద్యశాల నూతన భవనంలో సేవల ప్రారంభం ఎప్పుడో?

3


తాళం వేసి ఉన్న నూతన వైద్యశాల

గోల్కొండ కోటలో వేడుకకు హాజరైన ప్రముఖులు







ఎంపీ కవిత, తదితరులు

జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్



ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్



రాజీవ్ శర్మ, సీపీ మహేందర్ రెడ్డి తదితరులు



వేదికపై ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో డీజీపీ అనురాగ్ శర్మ, చీఫ్ సెక్రటరీ ఎస్‌పీ సింగ్



జెండా ఊంఛా రహే హమారా..

గోల్కొండలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

చారిత్రక గోల్కొండ కోటలో స్వాతంత్ర్య వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ముఖ్యమంత్రి కే. చంద్రశేఖరరావు జెండావిష్కరణ చేశారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పలు విభాగాల అధిపతులు ఈ వేడుకకు హాజరయ్యారు.







గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవానికి హాజరైన పలు విభాగాల అధిపతులు, ఎంపీలు జితేందర్ రెడ్డి, కేశవరావు, కేంద్ర మంత్రి దత్తాత్రేయ తదితరులు







విశిష్ట సేవా పురస్కారాలు సాధించిన ఐపీఎస్ అధికారులు సీవీ ఆనంద్, ప్రవీణ్‌కుమార్, వాకాటి కరుణ, ఎండీ షఫీవుల్లా, ఇతర అధికారులు

ఎర్రబెల్లి దయాకర్‌రావు, వినోద్, ఘంటా చక్రపాణి తదితరులు

మినీ లోకం



ఇదేనా కార్పొరేట్ వైద్యం?

- మురిపించారు.. మూసేశారు
- నియామకం కాని వైద్యులు, సిబ్బంది
- 25 రోజులుగా సముదాయాలకు తాళాలు

భద్రాచలం:రూ.18.14 కోట్లతో అధునాతన భవనాలను నిర్మించారు. రూ.1.03 కోట్లతో వైద్య పరికరాలను కొనుగోలు చేశారు. కార్పొరేట్ వైద్య సేవలందిస్తామంటూ మంత్రులు, అధికారులు ఊదరగొట్టారు. దీంతో ఎంతో మురిసిపోయిన ఏజెన్సీవాసులు తమకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందుతుందని భావించారు. కానీ ప్రస్తుతం భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో నూతన భవన సముదాయాల తీరును చూస్తే ఎప్పుడు వైద్య సేవలు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి.. దీనికి కారణం లేకపోలేదు. వైద్యశాల నిర్వహణకు అవసరమైన వైద్యులు, సిబ్బంది నియామకంపై నేటి వరకు ఎటువంటి స్పష్టత లేదు. ఫలితంగా అత్యవసర విభాగం, స్పెషాల్టీ ఓపీవిభాగం తదితర విభాగాలన్నీతాళాలు వేసి మూసేశారు.

22 రోజులైనా తెరుచుకోని తలుపులు

ఏరియా వైద్యశాలలో అధునాతన వైద్యం అందుతుందనే ఆనందంలో ఉన్న ఏజెన్సీవాసులు 22 రోజులైనా నూతన భవన సముదాయంలోని తలుపులు తెరుచుకోకపోవడంతో విస్తుపోతున్నారు. జూలై 24న రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డా. లక్ష్మారెడ్డి రూ.18.14 కోట్లతో నిర్మించిన నూతన వైద్య భవన సముదాయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇదిలా ఉండగా తొలి నుంచి ఇక్కడ పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించిన తరువాతే భవన ప్రారంభం చేపట్టాల్సి ఉండగా ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఖమ్మంలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్(ఎంసీహెచ్) ఇటీవల ఏర్పాటు చేయగా అక్కడ పూర్తిస్థాయిలోవైద్యులు సిబ్బందిని నియమించిన తరువాత ప్రారంభోత్సవం చేశారు. కాగా భద్రాచలంలో ఇందుకు భిన్నంగా ఎటువంటి నియామకాలు చేపట్టకుండానే ప్రారంభించి వదిలేసారు. కాగా 15 రోజుల్లో వైద్యులు, సిబ్బందిని నియమిస్తామని పేర్కొనగా నెల రోజులు సమీపిస్తున్నా ఈ విషయంపై ఎటువంటి కదలిక లేకపోవడం గమనార్హం.





తాళాలు వేసి ఉన్న అత్యవసర విభాగం, ఓపీ బ్లాక్ విభాగం

వైద్యులు, సిబ్బంది నియామకం ఎప్పుడు!

భద్రాచలం ఏరియా వైద్యశాలలో అదనంగా నిర్మించిన వంద పడకలతో ప్రస్తుతం ఏరియా వైద్యశాల 200 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయ్యింది. వంద పడకల ఆసుపత్రికి 18 మంది వైద్యులు, 24 మంది నర్సింగ్ సిబ్బంది, 15 మంది స్వీపర్లు, 35 మంది పారిశుద్య సిబ్బంది ఉండాల్సి ఉన్నట్లు సమాచారం. అయితే 200 పడకల వైద్యశాలకు క్యాడర్ స్ట్రెన్త్‌కు అనుగుణంగా వైద్యులు, సిబ్బంది నియామకం చేపట్టాల్సి ఉంది. వైద్యశాల అధునాతన భవన సముదాయం ప్రారంభించి 22 రోజులు గడుస్తున్నా ఇంకా ఎటువంటి కదలిక లేకపోవడం గమనార్హం.

రాష్ట్రంలో జాగృతిసేవలు మరింత విస్తృతం

- ఎన్ఆర్ఐ జాగృతి స్టేట్ అడ్వయిజర్

రఘునాథపాలెం:ఎన్ఆర్ఐల సహకారంతో రాష్ట్రంలో జాగృతి సేవలు విస్తృతం చేయనున్నట్టు ఎన్ఆర్ఐ జాగృతి స్టేట్ అడ్వయిజర్ చేవెళ్ల బిందులత అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్నారు. మండలంలోని మైనార్టీ ఆశ్రమ పాఠశాలలోని బాలికలకు మంచినీటి బాటిల్స్‌ను అందజేశారు. వివిధ జిల్లాల్లో పర్యటించి ప్రభుత్వ విద్యలో సమస్యలు, ఇతర ప్రజాసమస్యలు తెలుసు కుంటున్నామన్నారు. అందులో భాగంగా మండలంలోని మంచుకొండ పాఠశాలకు ఫర్నీచర్ అందించనున్నట్టు తెలిపారు. ఖమ్మంలో ఇంటర్నేషనల్ స్కూల్ స్థాపించి సామాన్యులకు సైతం కార్పొరేట్ విద్యను అంది స్తామన్నారు. 100మంది ఎన్ఆర్ఐలతో కలిసి ఖమ్మంలో అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టిసారిం చనున్నట్టు పేర్కొన్నారు.

45క్వింటాళ్ల బియ్యం పట్టివేత

ఇల్లెందుటౌన్: ఇల్లెందు పట్టణంలోని జేకే-5 హమాలీగడ్డ నుంచి అక్రమంగా తరలిస్తున్న 45క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం తెల్లవారుజామున ఇల్లెందు పోలీసులు పట్టుకున్నారు. ఇల్లెందు సీఐ డీ. వేణుచందర్ కథనం ప్రకారం పట్టణంలోని జేకే-5 హమాలీ గడ్డ ప్రాంతం నుంచి వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన 45 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఏపీ 16 టీడబ్ల్యూ 1725 నెంబర్‌గల డీసీఎంలో తరలిస్తున్నారని సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. డీసీఎం, బియ్యం స్వాధీన పర్చుకొని, బియ్యాన్ని తరలిస్తున్న లచ్చగూడెనికి చెందిన బత్తుల రాజు, ఇల్లెందుకు చెందిన సరోజ్ కోరిలపై కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.



పోలీసులు పట్టుకున్న లారీ

అశ్వారావుపేటలో ఇంజనీరింగ్ పాలిటెక్నిక్

అశ్వారావు పేట టౌన్:వచ్చే ఏడాది నుంచి అశ్వారావుపేట అవేర్ కళాశాల ఆవరణలో ఇంజనీరింగ్ పాలిటెక్నిక్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు అవేర్ ఛైర్మన్ పీకేఎస్ మాధవన్ తెలిపారు. సోమవారం ఆయన అవేర్ ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో జరిగిన వివిద కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలిటెక్నిక్ ఇంజనీరింగ్‌కోర్సును ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ప్రక్రియను ప్రారంభించినట్టు తెలిపారు. అవేర్ ఆధ్వర్యంలో నడుస్తున్న అగ్రి క్లినిక్ అండ్ అగ్రి బిజినెస్ మూడో బ్యాచ్‌కు ఈ నెల 29నుంచి తరగతులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని సరిసర ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వీరన్నగౌడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు కోర్టును సందర్శించిన ఖమ్మం జిల్లా జడ్జి




కోర్టును పరిశీలిస్తున్న లక్ష్మణ్

మణుగూరు: మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టును మంగళవారం ఖమ్మం జిల్లా జడ్జి ఎం లక్ష్మణ్, సబ్ జడ్జి వెంకటరమణ సందర్శించారు. మంగళవారం కోర్టుకు విచ్చేసిన జడ్జిలకు మణుగూరు బార్ అసోసియేషన్ సభ్యులు సాధర స్వాగతం పలికారు. అనంతరం జిల్లా జడ్జి లక్ష్మణ్ కోర్టు భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టుకు స్టెనో కావాలని విజ్ఞప్తి చేశారు. ఫర్నీచర్, కోర్టు భవనానికి ప్రహారీ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన జిల్లా జడ్జి కుర్చీలు, టేబుల్స్ సిద్ధంగా ఉన్నాయని.. త్వరలో పంపిస్తామన్నారు. ప్రహారీ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మెజిస్ట్రేట్ శ్యామసుందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మా రాంకోటయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

అధికార పార్టీలో ఆధిపత్య పోరు

చంద్రుగొండలో ఇరువర్గాల ఘర్షణ
పరస్పర దాడులు

చంద్రుగొండ: అధికారపార్టీలో ఆధిపత్యపోరు ప్రారంభమైంది. రెండు వర్గాలు బాహాబాహిగా కొట్లాడుకున్నారు. చంద్రుగొండ మండలంలో సోమవారం రాత్రి పోకలగూడెం గ్రామ ప్రధాన సెంటర్‌లో టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు భోజ్యానాయక్, గానుగపాడు సొసైటీ ఛైర్మన్ గోపాలరావు వర్గీయులు ఈ ఘర్షణకు దదిగారు. దీనిపై పోలీసు స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.తమపై దాడిచేసేందుకు సోమవారం అర్ధరాత్రి గానుగపాడు సొసైటీ ఛైర్మన్ గోపాలరావు అనుచరులతో ద్విచక్ర వాహనాలపై తమ గ్రామానికి వచ్చారని పార్టీ మండల అధ్యక్షుడు భోజ్యా నాయక్ ఆరోపించారు. ఆ సమయంలో కృష్ణాష్టమి పండగ సందర్భంగా గ్రామ శివారులోని దుర్గదేవి ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లిన గ్రామానికి చెందిన బాలు, చందర్, రాందాస్‌లపై గోపాలరావు వర్గీయులు దాడిచేసి కొట్టారని వెల్లడించారు. గోపాలరావు వర్గీయులతో తనకు ప్రాణ హాని ఉందని సదరుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, మంగయ్యబంజరు గ్రామంలో సోమవారం రాత్రి ఒక శుభకార్యక్రమానికి వెళుతుండగా, పథకం ప్రకారం తమపై మండల అధ్యక్షుడు భోజ్యా నాయక్ వర్గీయులు తమపై దాడి చేశారని గానుగపాడు సొసైటీ ఛైర్మన్ గోపాలరావు ఆరోపించారు. గ్రామ శివారులో కాపు కాసిన ఆ వర్గీయులు ద్విచక్ర వాహనాలపై వెళుతుండగా, దాడిచేసి కొట్టారని తెలిపారు. పార్టీ మండల అధ్యక్ష పదవీ నుంచి భోజ్యా నాయక్‌ను తొలగించాలని కోరుతూ ఆ వర్గీయులు మంగళవారం చంద్రుగొండ ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేసి నినాదాలు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో ఇరువర్గీయుల ఘర్షణలపై సర్వత్రా చర్చనీయాంశమైంది.





మాట్లాడుతున్న భోజ్యా నాయక్, అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గోపాలరావు

ఎస్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

మణుగూరు రూరల్: మండలంలోని ఎస్టీ కార్పొరేషన్ రుణాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో పురుషోత్తం మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తులను మండల ప్రజాపరిషత్ కార్యలయంలో ఒక కాపీ ఇవ్వాలని అన్నారు. మండలానికి 41 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. సెప్టెంబర్ 15వ తేదీలోపు దరాఖాస్తులను సమర్పించాలని కోరారు.

ఘనంగా 'పంద్రాగస్టు' వేడుకలు

వాడవాడలా మువ్వన్నెల పతాక రెపరెపలు


కోర్టులో జెండాను ఎగురవేస్తున్న మెజిస్ట్రేట్


వందనం చేస్తున్న మణుగూరు తహసీల్దార్


మణుగూరు టీఆర్ఎస్ కార్యాలయంలో..


గుండాల ఎంపీడీవో కార్యాలయంలో..

మణుగూరు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా జెండాలను ఎగురవేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాలయాలు, పార్టీ కార్యాలయాల్లో జెండాలను ఎగురవేశారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్థానిక టీఆర్ఎస్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మణుగూరు గాంధీబొమ్మ సెంటర్‌లో, బాంబే కాలనీ సెంటర్‌లో గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ విజయనిర్మల, నాయకులు ముత్యం బాబు, వెంకటరామారావు, రాజేష్, నాగకృష్ణ, కుర్రి నాగేశ్వరరావు, కుంజా నాగేశ్వరరావు, వట్టం రాంబాబు తదితరులు పాల్గొన్నారు. మణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో మెజిస్ట్రేట్ శ్యామసుందర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకోటయ్య, న్యాయవాదులు నర్సింహారావు, విజయ్, రమణారెడ్డి, రామ్మోహనాచారి, రవి, సరస్వతి, కవిత, సావిత్రి, మేదరమెట్ల శ్రీనివాస్ తదితరలు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగప్రసాద్, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ బిల్లా అశోక్‌కుమార్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షురాలు చిడెం అంజయ్య, సమితిసింగారం, రామంజారం, పగిడేరే పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌లు బచ్చల భారతి, పూర్ణ చందర్‌రావు, తాటి బిక్షం జెండాలను ఎగురవేశారు. ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో డోలి శ్రీనివాస్, ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం అహ్మాదుల్లా జెండాలను ఆవిష్కరించారు. టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు కేవి.రా వు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నేతలు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎక్సలెంట్, గౌతమ్‌మోడల్, మాంటిస్సోరి, శ్రీవిద్య, సత్యభాస్కర, న్యూకేంబ్రిడ్జి, అరుణోదయ తదితర పాఠశాలల్లో ఆయా పాఠశాలల యాజమాన్య సభ్యులు జాతీయ జెండాలను ఎగురవేశారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అధ్యక్షుడు దోసపాటి పిచ్చేశ్వరరావు, వాసవీక్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అధ్యక్షుడు బండారు నర్సింహారావు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మోహనన్ జెండాను ఆవిష్కరించారు.

బూర్గంపాడులో..

బూర్గంపాడు మండలంలో 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కైపు రోశిరెడ్డి, తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు, పోలీసు స్టేషన్లో ఎస్సై ఉదయ్‌కిరణ్, సొసైటీ కార్యాలయంలో పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌లు బొర్రా శ్రీను, బానోతు సరోజ, పుట్టికుమారి, కుర్సం వెంకటరమన, పోతిరెడ్డి సత్యవతి, ఆరె శ్రీలక్ష్మి జెండాలను ఎగుర వేశారు. బ్యాంకులు, ప్రభుత్వ పాఠశాలల్లో జెండాలను ఎగురవేశారు. మోరంపల్లిబంజరలోని జిల్ల ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో 240 అడుగుల జాతీయ జెండాను గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు అనంతరం పాఠశాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంఅలో ఐటీసీ ఓటరాక్ట సభ్యులు శ్రీనివాసరావు పాల్గొని గత సంవత్సరం పది ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు.

అశ్వాపురంలో..

అశ్వాపురం మండలపరిషత్, ఐఏపీ కార్యాలయంలో ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు విజయ్‌కుమార్, ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో రమణ, పోలీసు స్టేషన్‌లో సీఐ నరేందర్, ఫారెస్టు కార్యాలయంలో రేంజర్ రవికిరణ్ జాతీయపతాకాలను ఎగురవేశారు. గ్రామ పంచాయతీలు, పార్టీ కార్యాలయాల్లో పతాకాలు ఆవిష్కరించారు. వేడుకల్లో ఎంపీడీవో జిశ్రీదేవి, ఈవోఆర్డీ ఈదయ్య, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేశవరెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పినపాకలో..

పినపాక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొమరం సమ్మక్క, తహసీల్దార్ కార్యాలంలో తహసీల్దారు షరీఫ్, రేంజ్ కార్యాలయంలో రేంజి అధికారి ద్వాలియా, ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో వీరస్వామి, ఏడూళ్లబయ్యారం పోలీస్ స్టేషన్‌లో సీఐ జయపాల్, ఎస్సై సతీష్, జాతీయ జెండాలను ఆవిష్కరించారు. టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో జెండాను ఎగురవేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, టీఆర్ఎస్ నేతలు వెంకటేశ్వరరావు, భూషణం, రాము, పల్లెపు శ్రీను, సత్తిబాబు, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

గుండాలలో..

గుండాల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్థార్ శ్రీనివాస యాదవ్ జెండాను ఎగురవేశారు. అటవీశాఖ కార్యాలయంలో రేంజర్ కరుణాకరచారి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షురాలు చాట్ల పద్మ, కస్తూర్బా పాఠశాలలో ప్రిన్సిపాల్ స్వరూపరాణి, పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ శాంతయ్య, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వి.సురేష్, గురుకుల పాఠశాలలో శ్రీనివాస్, కళాశాలలో ప్రిన్సిపాల్ సుధాకర్, పీహెచ్‌సీలో వైద్యురాలు నాగశశి జెండాలను ఎగురవేశారు. టీడీపీ నాయకులు ఇల్లెందుల అప్పారావు టీడీపీ దిమ్మె వద్ద జెండాను ఎగుర వేశారు.

ఆళ్లపల్లిలో..

ఆళ్లపల్లి: మండలంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హరిచంద్, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మేకల కుమార స్వామి, పీహెచ్‌సీలో వైద్యురాలు నాగమణి, వెలుగు కార్యాలయంలో అధ్యక్షురాలు సుజాత జెండాలను ఎగురవేశారు. పాఠశాలలు, కార్యాలయాల్లోనూ జెండాలను ఎగురవేశారు.


గుండాల తహసీల్దార్ కార్యాలయంలో..


పినపాక సొసైటీ కార్యాలయంలో..


అశ్వాపురం ఎంపీడీవో కార్యాలయంలో..


మణుగూరు టీడీపీ కార్యాలయంలో..


ఆళ్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో..

'వీఆర్‌వోల విలీన ప్రక్రియను నిలిపివేయాలి'


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

భద్రాచలం: వీఆర్ఏ, వీఆర్‌వోల వ్యవస్థను రద్దు చేసి వ్యవసాయ శాఖలో విలీనం చేసే ప్రక్రియను రద్దు చేయాలని వీఆర్‌వోల సంఘం భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు కల్లూరి వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం భద్రాచలంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రిటీషు కాలం నాటి గ్రామ రెవెన్యూ వ్యవస్థను రద్దుపరచడం, విచ్ఛిన్నం చేయడం హేయమైన చర్యని అన్నారు. వీఆర్‌వోలను గ్రామ రెవెన్యూ వ్యవస్థలో కొనసాగిస్తూ రెవెన్యూ వ్యవస్థను పటిష్టపరచాలని కోరారు. విలీన నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన కోరారు. గ్రామ రెవెన్యూ శాఖను బలోపేతం చేయాలని ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు జలసూత్రం భాస్కర్‌రావు, సహాయ కార్యదర్శి పూనెం రమేష్, కల్చరల్ కార్యదర్శి కాక శ్రీను, జిల్లా ఉపాధ్యక్షులు పోలిబోయిన రామయ్య, జిల్లా ఉపాధ్యక్షులు వాసం నరసింహారావు, కొనబోయిన ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని విత్తన గోదాం

- రైతుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

అశ్వాపురం: మండల కేంద్రమైన అశ్వాపురంలో నిర్మించిన వ్యవసాయ విత్తన గోదాం అధికారుల నిర్లక్ష్యం మూలంగా యేళ్ల తరబడి ప్రారంభానికి నోచుకోవడం లేదు. రైతులకు సబ్సిడీ విత్తనాలు, యంత్ర పరికరాలు అందజేయడం కోసం దీనిని ఏర్పాటు చేశారు. అందుబాటులోకి రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి పంచాయతీరాజ్ శాఖ అధికారల నిర్లక్ష్యమే కారణమన్న విమర్శలు వస్తున్నాయి. రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్న ఉద్దేశ్యంతో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2012-13 బీఆర్‌జీఎఫ్ నిధులతో రూ. పది లక్షల అంచనా వ్యయంతో దీనిని నిర్మించారు. నాలుగేళ్లు దాటుతున్న పీఆర్ అధికారులు సంబంధిత భవనాన్ని వ్యవసాయ శాఖ అధికారులకు అప్పగించకపోవడంతో మండలపరిషత్ కార్యాలయంలోనే ఒక గదిలో వ్యవసాయాధికారులు తమ కార్యాలయంతో పాటు గోదాంగా ఉపయోగించుకుంటున్నారు. గోదాం లేక వ్యవసాయ శాఖ ద్వారా సరఫరా అయ్యే సబ్సిడీ విత్తనాలను సహకార సంఘాల ద్వారా అందజేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోదాంను ప్రారంభించాలని ఇందుకు ప్రేజా ప్రతినిధులు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.


మూసివున్న విత్తన గోదాం

విత్తన గోదాంకు మరమ్మతులు చేయాల్సి ఉందిన మండల వ్యవసాయాధికారి శంభో శంకర్ తెలిపారు. దీనిపై తిరిగి అంచనాలు రూపొందించి మరమ్మత్తులు నిర్వహిస్తామన్న అధికారుల్లో వారి నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు.

దురుసుగా ప్రవర్తిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

బూర్గంపాడు: బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక పంచాయతీలో గల భాస్కర్‌నగర్‌కు చెందిన పీట్ల కొండ అనే వ్యక్తిపై మంగళవారం బూర్గంపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. భాస్కరనగర్‌కు చెందిన ఓ మహిళ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో కొండ దురుసుగా ప్రవర్తించాడని ఆ మహిళ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి యువకుడిని అదుపులోకి తీసుకున్నారు.

మువ్వన్నెల రెప రెపలు..

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం ● వాడవాడలా ఎగిరిన జెండా


భద్రాద్రి తహసీల్దార్ కార్యాలయంలో..


భద్రాద్రి ఎంపీడీవో కార్యాలయంలో..


ఏఎస్పీ కార్యాలయంలో...


జెండాను ఎగురవేస్తున్న చర్ల తహసీల్దార్

భద్రాచలం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జెండాలను ఎగురవేశారు. భద్రాచలంలోని ఎస్ఎం బాయ్స్ హాస్టల్లో ఎమ్మెల్యే సున్నం రాజయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఏఎస్పీ కార్యాలయంలో ఎఎస్పీ సునీల్‌దత్, సీఆర్‌పీఎఫ్ సెకండ్ కమాండెంట్ కేసీ హలావత్, ఐటీడీఏ పీవో కార్యాలయం, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో బి.శివనారాయణరెడ్డి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఎంపీడీవో రమాదేవి, తహసీల్దారు రామకృష్ణ తమ కార్యాలయాల్లో జెండాలను ఎగురవేశారు. పోలీసు స్టేషన్‌లో సీఐ బి.శ్రీనివాసులు, ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఎస్సై అబ్బయ్య, భద్రాచలం ఎంవీఐ కార్యాలయం, లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఎంవీఐ ఎస్.వెంకట పుల్లయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మానె లక్ష్మి జెండాలను ఎగురవేశారు. టీఎన్జీవో కార్యాలయంలో అధ్యక్షుడు చల్లగుళ్ల నాగేశ్వరరావు, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో బందు వెంకటేశ్వరరావు, తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ సాదిక్‌పాషా జెండాలను ఎగురవేశారు. లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో చైర్మన్ మాగంటి సూర్యం జెండా ఆవిష్కరణ చేశారు. సెయింట్‌పాల్స్ లూథరన్ స్కూల్లో చైర్‌పర్సన్ కె.రాధామంజరి, రూపా స్కూల్లో పాఠశాల డైరెక్టర్ వి.మహాలక్ష్మి, గౌతమ్ పాఠశాలలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దోసపాటి రాము జెండాలను ఆవిష్కరించారు. బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో బస్టాండు సెంటర్లో మాజీ ఎమ్మెల్యేను కుంజా సత్యవతి జెండాను ఆవిష్కరించారు. టీఆర్ఎస్ కార్యాలయంలో టీఆర్ఎస్ నియోజకవర్గ బాధ్యులు మానె రామకృష్ణ జాతీయ జెండాను ఎగురవేశారు.

50 మీటర్ల జెండాతో ప్రదర్శన

భద్రాచలానికి చెందిన మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్టు, శ్రీ టెక్నాలజీస్ సంస్థ సంయుక్తంగా 50 మీటర్ల పొడవు గల జాతీయ జెండాతో పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొవ్వల మురళీ, శ్రీ టెక్నాలజీస్ నిర్వాహకులు మాధవ్ మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు జె.నాగరాజు, టి.పార్థసారధి, సాయిరాజు, పీఎంకేవై నిర్వాహకులు మాధవ్, మస్తాన్, చంటి, సిబ్బంది పాల్గొన్నారు.

చర్లలో..

చర్ల: చర్ల మండలంలో మంగళవారం స్వాతంత్రదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల వద్ద మువ్వన్నెల జెండా రెప రెపలాడింది. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, మేజర్ పంచాయితీ కార్యాలయం, పాత చర్ల గాంధీ విగ్రహం వద్ద సర్పంచి పున్నం జ్యోతిర్మయి, తహసీల్దార్ కార్యాలయంలో తాహసీల్దార్ సురేష్ కుమార్, ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో ప్రమీల రాణి, సెర్ప్ కార్యాలయంలో ఏపీఎం రాంకుమార్, అటవీ శాఖ కార్యాలయంలో రేంజి అధికారి బస్సీలాల్, విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఎంఈవో జుంకీలాల్ జెండాను ఎగురవేశారు. టీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద పరుచూరి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నల్లపు దుర్గా ప్రసాద్, బీజేపీ కార్యాలయం వద్ద పెద్దాడ అనంతశ్రీనివాస్ జెండాలను ఎగురవేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జెండాను ఎగురవేశారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలంలో స్వాతంత్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజాపరిషత్, తహసీల్దార్, విద్యాశాఖ, పోలీస్‌స్టేషన్, సీడీపీఓ, అటవీశాఖ, ప్రభుత్వపాఠశాలలు, సొసైటీ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జెండాలను ఎగురవేశారు. వసతి గృహాలు, పీహెచ్‌సీల్లోనూ జెండాను ఎగురవేశారు. వివిధ పార్టీల కార్యాలయాల్లోనూ వేడుకలు జరిగాయి. ఆయా పార్టీల నేతలు జెండాలను ఎగురవేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ అధ్యక్షురాలు తెల్లం సీతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు సత్యనారాయణ, తహసీల్దార్ లక్ష్మణస్వామి, ఎస్ఐ బి.బాలకృష్ణ, ఎంఈవో సున్నం సమ్మయ్య, సీడీపీవో రాజేశ్వరి, డాక్టర్ పవన్‌కుమార్, డ్వా‌ర్ నరేష్, సొసైటీ చైర్మన్ రవికుమార్, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సుధాకర్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.


భద్రాద్రి టీఎన్జీవో కార్యాలయంలో..


దుమ్ముగూడెం తహసీల్దార్ కార్యాలయంలో


జెండాను ఎగురవేస్తున్న చర్ల సర్పంచ్

ముత్యాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు


పూజలు నిర్వహిస్తున్న మహిళలు

దుమ్ముగూడెం: శ్రావణ మంగళవారం సందర్భంగా దుమ్ముగూడెం శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రసాదంగా స్త్రీలకు రవికతోపాటు పసుపు, కుంకుమలను ఉచితంగా అందజేశారు. వేలాది మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చైర్మన్ మజ్జి త్రినాదరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

రూ.25 వేల నగదు స్వాధీనం

చర్ల: చర్ల మండల పరిధిలోని సత్యనారాయణపురంలోని పేకాట స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఎనిమిది మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.25 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చర్ల ఎస్సై సత్యనారాయణ తెలిపారు. వారి పై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామని తెలిపారు. ఇదిలావుండగా.. చర్ల మండలంలో పలు చోట్ల జోరుగా సాగుతున్న జూదంపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన అధికారులు పేకాట స్థావరాలపై నిఘా ఏర్పాటుచేశారు.

బూర్గంపాడులో..

బూర్గంపాడు: బూర్గంపాడు మండల పరిధిలోని కృష్ణసాగర్ అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేశారు. దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా వారి నుంచి రూ.16,300 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

రామయ్యకు ఘనంగా నిత్య కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: స్వామి వారికి నిత్య కల్యాణ మండపంలో నిత్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామి వారిని నిత్య కల్యాణ మండప వేదిక వద్దకు తీసుకురాగా తొలుత సహస్రనామార్చన నిర్వహించారు. జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, బ్రహ్మముడి, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. ఇదిలావుండగా.. దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ద్వితీయ శ్రీ మద్భాగవత సప్తాహం కొనసాగుతోంది.



అచుతాపురం అటవీపరిశోధనకేంద్రంలో గదిలో ఉంచిన జెండా కర్ర

మందు.. జెండావందనం బందు!

మద్యం తాగుతూ జాతీయ పండుగను మరిచిన ఉద్యోగి

తాగటం తప్పుకాదని ఎదురు ప్రశ్న

అటవీ రేంజ్ అధికారి సదానందాచారిపై చర్యలు

అశ్వారావుపేట/ అశ్వారావుపేట టౌన్: ఆయన నిరక్షరాస్యుడు కాదు... ఏదో పెద్దగ చదువుకోని చిరుద్యోగి కాదు... ఆయనో ఉన్నత విద్యావంతుడు. ఉన్నతస్థానంలో ఉన్న ఉన్న తోద్యోగి. స్వాతంత్ర దినోత్సవాన్ని మరచి మద్యం మత్తులో జెండా ఎగురవేయకుండా వదిలేశాడు. అంతేకాదు మందు తాగడం తప్పుకాదు, జెండా ఎగురవేయకపోవడం పెద్ద నేరంకాదు దీనికెందుకు ఇంత రాద్ధాంతం. మీరు సహకరించాలి... చూసీచూడనట్టు పోవాలంటూ వ్యాఖ్యానించాడు.ఈ సంఘటన మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం, అచుతాపురంలో జరిగింది. అచుతాపురం అటవీపరిశోధన కేంద్రం రేంజ్ అధికారి సదానందాచారి జాతీయ జెండా ఆవిష్కరణను మరిచారు. నారంవారిగూడెంలోని ఓబెల్ట్‌షాపులో మద్యం తాగుతూ పత్రికా విలేకరులకు అడ్డంగా దొరికాడు. ఈ రోజు స్వాతంత్ర దినోత్సవం కదా అంటూ వారు ప్రశ్నించగా, జెండా ఎగురవేయకపోవడం పెద్ద నేరమా ఏమన్నా? స్వాతంత్ర దినోత్సవం అయితే బీరు కూడా తాగకూడదా అంటూ ఎదురు ప్రశ్నలు వేశారు. విలేకరులు ఫొటోలు తీస్తున్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా తాగుతూనే ఉన్నారు. ఆ తరువాత తాపీగా లేచి కారులో ఎంచక్కా కార్యాలయానికి వెళ్లారు. ఆయనను వెంబడించి కార్యాలయానికి వెళ్లారు. జెండా ఉదయమే ఎగురవేశాను కదా.... జెండా కర్ర విరిగిపోతుందని తీసి లోపల పెట్టాము. దీనికే ఎందుకీ రాద్ధాంతం. అయినా వీటన్నిటిని పట్టించుకోకుండదు బాయి... మీరంతా సహకరించాలి. ఇదంతా మామూలే అంటూ వ్యాఖ్యానించారు. మద్యం మత్తులో అసలు జెండాను ఎగురవేయకుండానే కారు లో ఎంచక్కా ఇంటికెళ్ళిపోయాడు. అక్కడే ఉన్న బీట్ అధికారి లక్ష్మణరావును ఇదేమిటి జెండా ఆవిష్కరణ చేయకుండా వదిలేశారని ప్రశ్నించగా, రేంజర్ నేను వచ్చేవరకు జెండాను ఎవరూ ముట్టుకోవద్దని ఆదేశించారని చెప్పారు. ఇప్పుడే వస్తానంటూ బైటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆయనకోసం ఎదురు చూస్తున్నామని, ఇప్పటివరకు రాలేదని తెలిపారు.అప్పటికీ సమ యం ఉదయం 11:30 అయింది. రేంజ్ అధికారిపై తక్షణమే చర్య తీసుకోవాలనే ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



సదానందాచారి

ప్రభుత్వ పాఠశాలలో ఎగరని తిరంగా

దుమ్ముగూడెం: మండలంలోని కొమ్మనా పల్లి ఏకోపాధ్యాయ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వాతంత్ర్య వేడుకలు జరగలేదు. జాతీయజెండా ఆవిష్కరించాల్సిన ప్రధానోపాధ్యాయుడు గైర్హాజరయ్యారు. మంగళవారం ఉదయాన్నే పాఠశాలకు వచ్చిన విద్యార్థులు జెండా దిమ్మెతోపాటు, పాఠ శాలను అందంగా అలంకరించారు. ఉదయం ఏడునుంచి పద కొండు గంటల వరకు ప్రధానోపాధ్యాయుడి రాక కోసం ఎదురు చూశారు. ఆయన రాకపోవడంతో జెండాను పాఠశాలగదిలో ఉంచి నిరాశతో వెనుదిరిగారు.

స్వాతంత్ర్య వేడుకల్లో దళిత మహిళా సర్పంచ్‌కు అవమానం

బూర్గంపాడు: బూర్గంపాడులోని తహసీల్దారు కార్యాలయంలో సర్పంచ్‌కు అవమానం జరిగింది. తమతో కొబ్బరికాయ కొట్టించ కుండానే జెండా వందనం కార్యక్రమం నిర్వహించడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లా డూతూ దళిత మహిళ సర్పంచ్ అనే ఉద్దేశ్య పూర్వకంగానే చిన్నచూపుతో అగౌరవపరిచారని ఆరోపించారు. ఈ విషయమై కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచ్ కుమారి,ఉపసర్పంచ్ చిప్పా సుధాకర్ చెప్పారు.



జెండా వందనం జరగని పాఠశాల

లైంగిక వేధింపుల ఘటనలో హెచ్ఎం సస్పెన్షన్

ఖమ్మం ఎడ్యుకేషన్ : ఖమ్మం జిల్లా బోనకల్ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడిని డి. రమణయ్యను మంగళవారం సస్పెండ్ చేస్తూ డీఈవో విజయలక్ష్మిబాయి ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల పాఠశాలలో విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు ఈ చర్య తీసుకున్నట్లు డీఈవో పేర్కొన్నారు.

కోమాలోనే డాక్టర్ ఝాన్సీలక్ష్మి

నిపుణుల పర్యవేక్షణలో ప్రత్యేక వైద్యం

సోమవారం అర్ధరాత్రి కొత్తగూడెం చేరిన మృతదేహాలు

కొత్తగూడెం క్రైం: కొత్తగూడెం పట్టణానికి చెందిన ప్రసూతి వైద్యురాలు ఝాన్సీలక్ష్మి ఇంకా కోమాలోనే ఉన్నట్లు తెలిసింది. నార్కెట్‌పల్లిలోని కామినేని వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆమె మెదడులో రక్తం గడ్డకట్టినట్లు గుర్తించిన వైద్యులు అత్యవసర వైద్యసేవలను అందిస్తున్నారు. వారు ప్రయాణిస్తున్న కారు వేగంగా వెళ్లి ఆయిల్ ట్యాంకర్‌ను ఢీ కొట్టడంతో ఆమె భర్త విజయ్‌కుమార్, తల్లి సావిత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో అపస్మారస్థితిలో ఉన్న ఝాన్సీలక్ష్మిని కామినేని ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో వెంటిలేషన్‌పై ఉంచి చికిత్స చేస్తున్నారు. ఆమెను పరీక్షించిన డాక్టర్లు 24 గడిచిన తరువాత గానీ చెప్పలేమని పేర్కొన్నట్లు ఆమె బంధువులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆమె శరీరం వైద్యానికి సహకరిస్తున్నట్లు తెలిసింది.

సోమవారం అర్ధరాత్రి కొత్తగూడెం చేరిన మృతదేహాలు

డాక్టర్ మద్దికాయల విజయ్‌కుమార్, డాక్టర్ ఝాన్సీలక్ష్మి తల్లి సావిత్రమ్మ మృతదేహాలు సోమవారం రాత్రి కొత్తగూడెం చేరుకున్నాయి.సోమవారం ఉదయం కారులో తేనేటి విందు, సాయంత్రం కోడలి రిసెప్షన్‌కు వెళ్లాల్సిన ఈ డాక్టర్ దంపతుల ప్రయాణం విషాదంగా మిగిలింది.

30ఏళ్లుగా వైద్యం

కొత్తగూడెం బర్లిపిట్ ఏరియాలో వీరిరువురు ఇళ్లు, ఆసుపత్రిని ఒకే చోట నిర్మించుకున్నారు. ఒక్కగానొక్క కుమారుడు హర్ష పేరు మీదనే హర్ష క్లినిక్‌ను స్థాపించి 30సంవత్సరాలుగా వైద్యవృతిలో కొనసాగుతున్నారు. కుమారుడు హర్ష నిశ్చితార్థం ఈనెల 12న వైభవంగా జరిగింది. ఆ ఇంట్లో ఒకేరోజు రెండు వేడుకలు జరిగా యనే విషయం కూడా చాలా మందికి తెలియని విషయం. 12న డాక్టర్ ఝాన్సీ మేనకోడలు వైష్ణవి పెళ్లి వేడుకలతో పాటు అదే రోజు వారింట్లో తమ కుమారుడి నిశ్చితార్థం కూడా చేసుకున్నారు. కాగా, ఈకార్తీక మాసంలో పెళ్లి నిశ్చయ మైనట్లు తెలిసింది. సోమవారం సాయంత్రం వరుడు కిరణ్ స్వగ్రామమైన జడ్చర్లలో వివాహ రిసెప్షన్ ఉండటం... ఈ వేడుకలకు అమెరికాలో స్థిరపడ్డ ఆమె సోదరుడు దాసరాజు సత్యనారాయణ తేనేటి విందుకు హైదరాబాద్ రావాల్సిందిగా ఆహ్వానం పలకడంతో సోమవారం ఉదయాన్నే బయలుదేరారు. డాక్టర్ దంపతులు కారు ప్రమాదానికి గురయ్యారు. కాగా విజయ్‌కుమార్, ఝాన్సీలక్ష్మిల తనయుడు హర్ష మంగళవారం అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరి బుధవారం ఉదయం కల్లా కొత్తగూడెం చేరుకుని తండ్రి, అమ్మమ్మ అంత్యక్రియల్లో పాల్గొననున్నాడు.



కామినేని ఆసుపత్రిలో ఝాన్సీ తనయుడితో మాట్లాడుతున్న మంత్రి పద్మారావు

ఝాన్సీ చికిత్స వివరాలు తెలుసుకున్న మంత్రి పద్మారావు

కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఝాన్సీకి అదతుతున్న సేవలను ప్రొహిబిషన్, ఎక్సైజ్, యువజన సర్వీసులు క్రీడల శాఖామంత్రి పద్మారావు గౌడ్ తెలుసుకున్నారు. కొత్తగూడెంలో స్వాతంత్ర్య దినోత్సవానికి హాజరై తిరిగి వెళుతూ కామినేని ఆసుపత్రికి వెళ్లారు. అక్కడే ఉన్న ఝాన్సీ తనయుడిని పరామర్శించారు. ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చేయాలని కామినేని ఆసుపత్రి వైద్యవర్గాలను మంత్రి

యాపిల్‌లోడ్ లారీ బోల్తా



బోల్తాపడిన లారీ

వైరా: మండలంలోని తాటిపూడి-జింకల గూడెం గ్రామాల ప్రధాన రహదారిపై మంగళవారం తెల్లవారుజామున యాపిల్ కాయల లోడ్‌తో వెళ్తున్నలారీ బోల్తాపడింది. హిమాచల్‌ప్రదేశ్ నుంచి ఈ లారీ హైదరాబాద్ వెళుతుండగా లారీటైరు పంక్చర్ కావడంతో ఈఘటన జరిగింది. లారీలోని యాపిల్ పెట్టెలు రోడ్డుపై పడిపోయాయి. మరో రెండు యాపిల్ లోడ్లతో ఉన్న లారీలు కూడా వెంటనే ఉండటంతో బందోబస్తు చేసుకున్నారు.

ఆవును ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

కారేపల్లి : అడ్డుగా వచ్చిన ఆవును ఢీకొట్టటంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో మంగళవారం జరిగింది. ఈ ఘటనలో మరో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం. విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన కుర్సంసురేష్,(32) ఏనుగ రమేష్, పరిటాలసాంబ రాత్రి సమయంలో మోటారు సైకిల్‌పై కారేపల్లి వెళుతున్నారు. బజ్యాతండా బస్టాండ్ సమీపంలో ఎదురుగా ఆవు అడ్డు వచ్చింది. బండి వేగంగా వెళుతుండటంతో అవును ఢీ కొట్టింది. బండిపై ఉన్న ముగ్గురు కిందపడ్డారు. సురేష్‌ను స్థానికులు మండల కేంద్రంలోనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. మరో ఇద్దరు గాయపడ్డారు.



సురేష్ మృతదేహం

సంఘటన స్థలానికి ఎస్ఐ అన్నెం కిరణ్‌కుమార్ సందర్శించారు. కేసు నమోదు చేశారు.మృతిచెందిన సురేష్ భార్య గర్భవతి.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

తల్లాడ: ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారుగూడెం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. ములకలపల్లి మండలం గండిప్రోలుకు చెందిన వీరు హైదరాబాద్ నుంచి గండిప్రోలుకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. మార్గమధ్యంలో అన్నారుగూడెం వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించే ప్రయత్నంలో రోడ్డు పక్కన ఆపి ఉన్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. అదుపుతప్పి రోడ్డుపై పడటంతో దీంతో కురసం గిరి, అతని భార్య రత్నమ్మ, కుమార్తె రూతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108వాహనంలో చికిత్స కోసం ఖమ్మం తరలించారు.

లారీ, ఆటో ఢీ-ముగ్గురికి గాయాలు

మరో ఘటనలో తల్లాడలోని ఐఎంఎల్ డిపో సమీపంలో సోమవారం రాత్రి లారీ, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్నముగ్గురికి గాయాలయ్యాయి. తల్లాడ నుంచి అన్నారుగూడెం వెళ్తున్న ఆటోను కొత్తగూడెం నుంచి తల్లాడ వైపు వస్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ లింగం స్టాలిన్, తాళ్లూరి శ్రీనివాసరావు, గుమ్మా హరిలకు గాయాలయ్యాయి.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 5,7

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): విద్యార్థులకు అడ్మిషన్లు లభిస్తాయి. ఫలితాలు ఉల్లాసం కలిగిస్తాయి. సోదరీ, సోదరుల విషయాల్లో శుభ పరిణామాలు సంభవం. ఒక సమాచారం ఉల్లాసం కలిగిస్తుంది. ప్రేమలు ఫలిస్తాయి.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): ఇల్లు, స్థల సేకరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. అనుకున్న డబ్బు సకాలంలో చేతికి అందుతుంది. ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

మిథునరాశి: (మే21-జూన్21): విద్యా సంస్థల్లో ప్రవేశంపై ఒక నిర్ణయానికి వస్తారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లకు అనుకూలం. వాహనాల కొనుగోలుకు అనుకూల సమయం. కీలకమైన మెయిల్స్, పత్రాలు అందుకుంటారు. కొత్త పరిచయాలు ఏర్పడతాయి.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన ఒత్తిడి తగ్గుతుంది. వేడుకలు, శుభకార్యాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. ఫొటోగ్రఫీ, గ్రానైట్, గ్రాఫిక్స్, రచనా రంగాల వారికి ప్రోత్సాహకరం.

సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): పొదుపు పథకాలు, పెట్టుబడులపై దృష్టి సారిస్తారు. శుభకార్యాలు, వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి. సహకార సంఘాలు, బ్యాంకులతో పనులు పూర్తవుతాయి. బృంద కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తారు.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): ప్రముఖులను కలుసుకుంటారు. వృత్తి, వ్యాపారాల్లో గత అనుభవంతో లక్ష్యాలు సాధిస్తారు. సినీ, రాజకీయ, ప్రభుత్వ రంగాల వారు గౌరవ పదవులు అందుకుంటారు. సంకల్పం నెరవేరుతుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): వివాహాది శుభకార్యాలు, సమావేశాల్లో కీలకపాత్ర పోషిస్తారు. ఆర్థికపరమైన వ్యూహాలు, ప్రణాళికలు అమలు చేస్తారు. బంధుమిత్రుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): రుణాలు, పెట్టుబడుల విషయంలో పెద్దల సహకారం లభిస్తుంది. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. రుణాలు మంజూరవుతాయి. ఇంక్రిమెంట్లు లభిస్తాయి. సంస్మరణల్లో పాల్గొంటారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): వివాహాది శుభకార్యాల్లో పాల్గొంటారు. శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ప్రియతముల నుంచి శుభ సందేశాలు అందుకుంటారు. రక్షణ, న్యాయ రంగాల వారికి శుభప్రదం.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): వ్యవసాయం, వ్యాపార రంగంలోని వారికి నిధులు సర్దుబాటవుతాయి. సహోద్యోగుల ఆంతరంగిక విషయాలు చర్చకు వస్తాయి. విందు, వినోదాలతో ఉల్లాసంగా గడుపుతారు. ఉద్యోగుల నియామకాలకు అనుకూలం.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): ప్రేమానుబంధాలు బలపడతాయి. చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభ పరిణామాలు సంభవం. పెట్టుబడులు లాభిస్తాయి. వివాహాది, శుభకార్యాల్లో పాల్గొంటారు. సంకల్పం నెరవేరుతుంది.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): గృహారంభ, ప్రవేశాలకు అనుకూలం. వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. సీట్లు, స్థలం మార్పు కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. చేపట్టిన పనులు పట్టుదలతో పూర్తిచేస్తారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

ఆలయ సమాచారం..

జమలాపురం వెంకన్న



కాటేజీ/సదనం	మొత్తం	ఖాళీలు
టీటీడీ సత్రం	12	00
సీహెచ్ఎన్ఎన్	10	03


సంప్రదించాల్సిన ఫోన్ నెం: 08749-279855
ఈవో రమణమూర్తి: 94910 00705
ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ : 99895 07300

- తెల్లవారుజామున 4.30గంటలకు ఆలయాన్ని తెరుస్తారు.
- 5గంటలకు తీర్థబిందెలు తెచ్చే కార్యక్రమం.
- 6.30కి మంగళహారతి, మంత్రపుష్పం సమర్పణ.
- ఉదయం 7.00గంటలకు బాలభోగ నివేదన.
- 7.10 నుంచి 12గంటల వరకు సర్వదర్శనం, ఆర్జిత సేవలు.
- 10.30 గంటలకు స్వామివారి నిత్య కల్యాణం.
- సాయంత్రం 3గంటల నుంచి తిరిగి ఆర్జిత సేవలు.

భద్రాచలం రామయ్య

కాటేజీ/సదనం	మొత్తం	ఖాళీలు
కాటేజీలు	26	19
వందగదుల సదనం	62	23
శ్రీరామ సదనం	18	11
టీటీడీ సదనం	26	05
సౌమిత్రి సదనం	30	09

సంప్రదించండి..
దేవస్థానం కేంద్రీయ విచారణ కార్యాలయం : 08743-232467, 7660007671



తెల్లవారుజామున 4.30 నుంచి 5.30 వరకు, ఉదయం 7 గంటల నుంచి 1గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 8.30 వరకు సర్వదర్శనం.

ప్రత్యేక దర్శనం టిక్కెట్టు ధర ఒకటికి : రూ.20

బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి నంబర్‌వన్

వచ్చే ఐదేళ్లల్లో 25 కొత్తగనుల ప్రారంభం ● స్వాతంత్ర్య వేడుకల్లో సింగరేణి సీఎండీ శ్రీధర్

ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం: బొగ్గుఉత్పత్తిలో సింగరేణి జాతీయస్థాయిలో నంబర్‌వన్‌గా నిలిచిందని ఆ సంస్థ ఛైర్మన్‌అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. శ్రీధర్ తెలిపారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని సింగరేణి ప్రకాశం గ్రౌండ్ లో 71వ స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు జాతీయజెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. విద్యార్థుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో మణుగూరు, మందమర్రి, కాశీపేట, కొత్తగూడెం, భూపాలపల్లిలో కొత్తగనులు ప్రారంభిస్తామన్నారు. వచ్చే ఐదేళ్లల్లో 25 కొత్తగనులకు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం రాష్ట్ర కరెంట్ అవసరాలు తీరుస్తోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సంస్థలో 66మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మరో 800మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్‌ప్లాంట్‌ను నిర్మిస్తామన్నారు. పర్యావరణ సహిత చర్యలోభాగంగా సంస్థ ఆధ్వర్యంలో కొన్ని ఏరియాల్లో 100 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ విద్యుత్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. సింగరేణి సంస్థలో గిరిజనుల కోసం 665 బదిలీ వర్కర్ ఉద్యోగాలకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. రెండేళ్లలో సింగరేణిసంస్థలో కొత్తగా 5,500 ఉద్యోగాలు కల్పించి అత్యంత పారదర్శకంగా నియామకాలు జరిపినట్లు తెలిపారు. రానున్న కొత్తగనుల్లో అవసరాలను ఆధారంగా ఉద్యోగ నియామకాలు చేపడతామన్నారు. సింగరేణి ఆణిముత్యాల ద్వారా ఇచ్చిన శిక్షణలో 82 మంది పోలీస్‌శాఖలో ఉద్యోగాలు పొందారని వివరించారు. తెలంగాణాకు హరితహారంలో భాగంగా కోటి మొక్కలు నాటేందుకు సిద్ధమయ్యామని ఇప్పటికే 67లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కేంద్ర బొగ్గుశాఖ అన్ని బొగ్గుపరిశ్రమల్లో 15 రోజులపాటు పరిసరాల పరిశుభ్రతపై స్వచ్ఛ్ పక్వాడా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సింగరేణి సామాజిక బాధ్యతలో భాగంగా సమీప, పట్టణాలు, గ్రామాల అభివృద్ధికి మౌలికసదుపాయాలు, ఉచిత వైద్యశిబిరాల ఏర్పాటుకు రూ. 20కోట్ల నిధులు కేటాయించామన్నారు. సంస్థ కృషికి గుర్తింపుగా గత మేడే రాష్ట్ర కార్మికశాఖ సింగరేణి సంస్థకు బెస్ట్‌మేనేజ్‌మెంట్ అవార్డును బహూకరించిందన్నారు. కేంద్రం నుంచి నేషనల్ అవార్డు ఫర్ ఎక్స్‌లెన్ ఇన్‌కాస్ట్ మేనేజ్‌మెంట్‌ను కూడా అందచేసిందన్నారు. సింగరేణి వ్యాప్తంగా 11ఏరియాల్లోని విధులు సక్రమంగా నిర్వహించి బొగ్గు ఉత్పత్తిలో సహకరించిన ఉత్తమ సింగరేణీయులు 11మందిని సింగరేణి సీఎండీ సత్కరించి బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ (పా) పవిత్రన్‌కుమార్, సింగరేణి డైరెక్టర్లు భాస్కర్‌రావు (పీపీ), చంద్రశేఖర్ (ఆపరేషన్), శంకర్ (ఈఅండ్ఎం), జీఎంలు ఆనందరావు, మసూద్ ముజాహిద్, బసవయ్య, రాం బద్రిరాజు, టీబీజీకేఎస్ నాయకులు కెంగర్ల మలయ్య, కనకరాజు, అధికారుల సంఘం అధ్యక్షుడు గడిపెల్లి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.



సింగరేణి ఉత్తమ అధికారిగా అవార్డు అందుకుంటున్న కృష్ణమోహన్‌రావు

గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ట్రైకార్ కింద రూ.1.84 కోట్లతో యూనిట్ల మంజూరు

గిరిజన విద్యార్థులకు 717.55 లక్షలు ఉపకార వేతనాల విడుదల

భద్రాచలం ఆర్డీవో శివనారాయణరెడ్డి

భద్రాచలం: గిరిజనుల అభివృద్ధి ప్రభుత్వం కృషి చేస్తోందని భద్రాచలం ఆర్డీవో శివనారాయణ రెడ్డి పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భద్రాచలం ఐటీడీఏ ద్వారా గిరిజనుల అభివృద్ధికి రూ. కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన జాతీయ పతాక ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత ఆర్డీవో జాతీయ జెండాను ఆవిష్కరించి అనంతరం వివిధ పాఠశాలల నుంచి విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ ఇరు జిల్లాల్లోని 321 గిరిజన విద్యా సంస్థల్లో 31,778 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని అన్నారు. గత ఏడాది పదో తరగతిలో 3,137 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 2,582 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఉపకార వేతనాల కింద రూ.102.18 లక్షలు విడుదల చేసినట్లు వివరించారు. రాజీవ్ విద్యా దీవెన పథకం కింద రూ.38.36 లక్షలతో 1160 మంది విద్యార్థులు లబ్ధిపొందారన్నారు. అంబేద్కర్ ఓవరిస్ విద్యానిధి కింద రూ.20 లక్షలు ఇద్దరు విద్యార్థుకు మంజూరు చేశామని పేర్కొన్నారు. రెండు పడకల గృహ నిర్మాణ పథకం కింద పినపాక నియోజకవర్గంలో 400, భద్రాచలంలో 258, అశ్వారావుపేటలో 400, వైరాలో 80, ఇల్లెందులో 160 ఇళ్ల నిర్మాణాలు చేపట్టామని, ఇందులో 400 పూర్తి కాగా 100 పనులకు ప్రారంబోత్సవం చేశామని మిగిలిన 918 పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ కిట్ల పథకం కింద జూన్ రెండు నుంచి ఇప్పటి వరకు 1701 మందికి ఇచ్చామన్నారు. ట్రైకార్ కింద 92 మంది లబ్దిదారులను ఎంపిక చేసి రూ.184 లక్షలు అందజేశామన్నారు. పేదరిక నిర్మూలన పథకం కింద 12 మండలాల్లో 37,925 గిరిజన నిరుపేద, పేద కుటుంబాలు సంఘాలుగా చేర్చామన్నారు. 52 ఎల్డర్ సంఘాలు ఏర్పాటు చేసి 12 మండలాల్లో 143.97 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు.

మరోసారి జెండా ఆవిష్కరణకు ఇబ్బందులు

భద్రాచలం ఐటీడీఏకు పూర్తిస్థాయి పీవో లేకపోవడంతో స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని జెండా ఆవిష్కరణ సమయంలో ఇబ్బందులు తలెత్తాయి. రెండేళ్లుగా పూర్తిస్థాయి పీవో లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా అప్పటికప్పుడు ఉన్నతాధికారులు వచ్చి జెండా ఆవిష్కరణ నిర్వహిస్తున్నారు. ఈసారి అదే రీతిలో భద్రాచలం ఆర్డీవో బి.శివనారాయణరెడ్డి జెండా ఆవిష్కరించారు.

హెవీవాటర్‌ప్లాంట్‌లో పంద్రాగస్టు వేడుకలు

అశ్వాపురం: స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని అశ్వాపురం వాటర్‌ప్లాంట్ జీఎం జితేంద్ర జాతీయ జెండాను ఎగరేశారు. ఏఈసీఎల్ స్కూల్ గ్రౌండ్‌లో ఈ వేడుకలు జరిగాయి. అనంతరం సీఐఎస్ఎస్ సిబ్బంది నుంచి గౌరవవందనం స్వీకరించారు. వేడుకల్లో భాగంగా వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీజీఎంలు అరుణ్‌బోస్, ఏడీఎంవో బోస్, సీఏవో అంజనీకుమార్, ఏఈసీఎస్ స్కూలు ప్రిన్సిపాల్ వెంకన్న పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్ అందజేస్తున్న ఆర్డీవో



జెండా ఆవిష్కరిస్తున్న హెవీవాటర్‌ప్లాంట్ జీఎం





భలే బబుల్స్

హాంకాంగ్‌లోని విక్టోరియా హార్బర్... సాయంత్రం సమయం. సందర్శకులతో ఆ ప్రాంతమంతా సందడిగా ఉంది. కార్యక్రమం ఎప్పుడు మొదలవుతుందా అని అందరి ముఖాల్లో ఒకటే టెన్షన్. ఆ సమయం రానే వచ్చింది. ఒక్కసారిగా కొన్ని లక్షల గాలి బుడగలతో హార్బర్ మొత్తం నిండిపోయింది. సందర్శకుల ఆనందాలకు అవధులు లేవు. పిల్లలైతే గాలి బుడగలను పట్టుకుంటూ కేరింతలు కొట్టారు. పెద్దలు ఆ సుందరదృశ్యాన్ని తమ మొబైల్‌లో బంధించారు.

గాలి బుడగలను చూస్తే బాల్యం గుర్తొస్తుంది. సరిగ్గా ఆ బాల్యస్మృతులు గుర్తు చేయాలనే ఆలోచనతోనే ఈ బబుల్స్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. కొన్ని వేల గాలి (నీటి) బుడగలను గాలిలోకి వదిలే ఈ ప్రాజెక్టుకు 'మెమోరియల్ రీబర్త్' అని పేరు పెట్టారు. హాంకాంగ్‌లోని విక్టోరియా హార్బర్ కేంద్రంగా దీన్ని చేపట్టారు. మూడు మీటర్ల పొడవుండే ఒక ప్రత్యేక యంత్రంపై 50 బబుల్స్‌ను వదిలే పరికరాలను అమర్చారు. వాటిని రకరకాల డైరెక్షన్లలో అమర్చారు. ఈ యంత్రాన్ని హార్బర్ సమీపంలోని సెంటర్‌లో అమర్చారు. ఈ యంత్రంతో ఒక్క నిమిషానికి 10 వేల బబుల్స్‌ను గాలిలోకి వదిలారు. కొన్ని నిమిషాల్లోనే కొన్ని లక్షల బబుల్స్‌తో హార్బర్ మొత్తం నిండిపోయింది. అంతే.... ఆ ప్రాంతమంతా సందర్శకుల కేరింతలతో హడావిడిగా మారింది. ఒక్కసారిగా సందర్శకులు తమ ఫోన్‌లకు పనిచెప్పారు. సెల్ఫీలు దిగుతూ, ఫొటోలు తీస్తూ ఆనందంగా గడిపారు. హార్బర్ బ్యాక్‌డ్రాప్‌లో బబుల్స్‌ను చూస్తూ సందర్శకులు తమ బాల్యస్మృతులను గుర్తుచేసుకున్నారు.

- ఒక్క నిమిషానికి 10 వేల బబుల్స్ గాలిలోకి వదిలారు. అంటే 20 నిమిషాల్లో లక్షల గాలి బుడగలు గాలిలో చేరాయి.
- హార్బర్ బ్యాక్‌డ్రాప్‌లో బబుల్స్ కనిపించేలా ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతం కనువిందుగా మారింది.
- కొన్ని లక్షల బబుల్స్ వదలడంతో హార్బర్ సిటీ మాల్ మొత్తం బబుల్స్‌తో నిండిపోయింది.
- ప్రతి 15-20 నిమిషాలకొకసారి 35 లీటర్ల నీటిని కలిపి బబుల్స్ వదిలారు.

ఎవరిదీ ఆలోచన?

జపాన్‌కు చెందిన 47 ఏళ్ల ఒహమాకీ ఆలోచన ఇది. "నా ఎగ్జిబిషన్‌లోని స్పేస్ మొత్తం బబుల్స్‌తో నింపాలనుకున్నాను. సందర్శకులకు కొత్తగా ఏదైనా అందించాలని అనుకున్నాను. ఆ ఆలోచన రూపమే ఈ బబుల్స్. ఒకవేళ బబుల్ మాదిరిగా ప్రపంచం అదృశ్యమైపోతే ఎలా ఉంటుంది? అన్న ఆలోచన రేకెత్తించాలన్నది కూడా కారణమే. పబ్లిక్ ఆర్ట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ బబుల్స్‌ను వదిలే ప్రాజెక్ట్‌ను ప్రారంభించాం" అన్నారాయన..



'మెమోరియల్ రీబర్త్' ప్రాజెక్ట్ ఒక్కరోజు మాత్రమే చేస్తున్నారనుకుంటే పొరపాటే. ఆగస్టు 2న ప్రారంభించిన ఈ కార్యక్రమం 20వ తేదీ వరకు కొనసాగుతుంది. అందరు సందర్శకులకూ అవకాశం కల్పించాలని బబుల్స్ ప్రోగ్రామ్‌ను కొనసాగిస్తున్నారు. ఇక్కడ వదిలే బబుల్స్ అన్నీ ఒకేలా ఉండవు. దాదాపు 20 రకాల బబుల్స్ వదులుతుంటారు. రంగు రంగుల బబుల్స్‌తో పిల్లా పెద్దా తేడా లేకుండా అందరూ ఎంజాయ్ చేస్తున్నారట. ఇలా లక్షలకొద్దీ బబుల్స్‌ను గాలిలోకి వదలడం ఇదే మొదటిసారి. ప్రపంచంలో ఎక్కడా కూడా ఇలాంటి ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించలేదట. రోజూ బబుల్స్ వదిలే సమయానికి హార్బర్ ప్రాంతమంతా సందర్శకులతో కిటకిటలాడుతోందట!

చకచకా చెప్పండి

బిరబిర పారే నీటిలో గిరగిరా తిరిగే సుళ్లు సురసుర కాగే నూనెలో కరకరలాడే మురుకులు

జంతర్‌మంతర్

1. గసంతి ▸ ....
2. విషంశే ▸ ....
3. ఊలయ ▸ ....

జంబ్లింగ్ వర్డ్స్

1. USOP ▸ ....
2. OULD ▸ ....
3. OKBO ▸ ....

పదాలు కనుక్కోండి

E	D	E	P	T	I	G	D	L	O
T	N	R	E	Q	P	N	D	L	S
A	A	O	O	U	I	G	L	S	B
C	E	T	S	F	H	B	F	B	S
S	D	M	C	T	O	O	R	O	R
L	O	R	A	N	U	F	P	T	V
H	W	M	N	C	Q	T	E	S	O
N	W	H	X	O	V	R	P	L	S
D	O	I	A	Z	A	G	U	T	I
L	B	S	T	T	Z	M	A	K	C

FIND FOR FUN CAME CAN CAR AND ARE TOO WHAT

జతపరచండి



చుక్కలు కలపండి



టంగ్ ట్విస్టర్స్

1. Whoever slit the sheets is a good sheet slitter.
2. Crush grapes, grapes crush, crush grapes.
3. There was a minimum of cinnamon in the aluminum pan

చెప్పగలరా?

వరుడులో ఉన్నా కానీ గురుడులో లేను
మధులో ఉన్నా కానీ మత్తులో లేను
ఆవులో ఉన్నా కానీ ఆవలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

మీకు తెలుసా?

మనం ప్రతి ఏటా 19.4 బిలియన్ పౌండ్ల ప్లాస్టిక్ చెత్తను సముద్రంలోకి వదులుతున్నాం.

నవ్వుల్ నవ్వుల్

టీచర్ : స్వెటర్‌ను అలా విసిరి పారేస్తున్నావు. దాని విలువ తెలుసా రా నీకు?

చింటూ : నాకు తెలియదు టీచర్!

టీచర్ : ఒక స్వెటర్ అల్లాలంటే మూడు గొర్రెలు కావాలి తెలుసా?

చింటూ : అవునా టీచర్! గొర్రెలు స్వెటర్లు అల్లుతాయని నాకిప్పటి వరకూ తెలియదు.

టీచర్ : !!!!!!!!

మిస్టర్ మేధావి : రాంబాబూ! నీ పిల్లలు బాగా ఎదిగిపోయారు! ఏరా రాము, సోము మీరు ఏం చేస్తున్నారు ఇప్పుడు?

రాము : నేను ఎస్ఎమ్ఎస్ చేస్తున్నా.

సోము : నేను ఎమ్ఎమ్ఎస్ చేస్తున్నాను.

మిస్టర్ మేధావి : ఎంత ఇబ్బందైనా పిల్లల్ని బాగా చదివిస్తున్నావు రా!

రాంబాబు : !!!!!!!!

రంగులు వేయండి



దారి కనుక్కోండి



జవాబులు

జంబ్లింగ్ వర్డ్స్ : 1. SOUP 2. LOUD 3. BOOK
జంతర్‌మంతర్ : 1. సంగతి 2. విశేషం 3. ఊయల
చెప్పగలరా? : వధువు

ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం

● స్వాతంత్ర్యవేడుకల్లో ఎక్సైజ్ మంత్రి పద్మారావు
● ప్రగతి మైదానంలో జెండా ఆవిష్కరణ..
పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరణ

ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం: రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రొహిబిషన్, ఎక్సైజ్, యువజన సర్వీసులు క్రీడల శాఖామంత్రి పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో నిర్వహించిన 71వ స్వాతంత్ర్య వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం పలు అభివృద్ధి పథకాలను చేపట్టి రాష్ట్రంలోనే జిల్లాను నెంబర్-1 స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తోందన్నారు. మిషన్‌కాకతీయ పథకంలో భాగంగా 1, 2, 3 దశల్లో 1159 చెరువులు అభివృద్ధి పనులు చేపట్టి రూ. 308. 58కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. మరమ్మతులు, పునరుద్ధరణ, ఆధునీకరణ కింద 13,445 ఎకరాల స్థిరీకరించేందుకు 31 చెరువులకు రూ. 28. 39కోట్లు మంజూరు చేశామన్నారు. సింగభూపాలెం చెరువు అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు. మిషన్‌కాకతీయ పథకంలో చూపిన ప్రతిభకు కలెక్టర్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎక్సలెన్సీ అవార్డు ప్రకటించడం హర్షణీయమన్నారు.

ఇంటింటికీ తాగునీరు

మిషన్‌భగీరథ పథకం కింద ఇంటింటికీ శుద్ధి చేసిన తాగునీటిని అందచేసేందుకు జిల్లాలో 313 గ్రామాలకు నీరు అందించేందుకు రూ. 2,250కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నిర్మిస్తున్న ఇన్‌టేక్‌వెల్ ద్వారా గోదావరి నీటిని శుద్ధిచేసి పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట, ఇల్లెందు, భద్రాచలం తదితర ప్రాంతాల్లోని 21 మండలాలకు సరఫరా చేస్తామన్నారు. 2018 మార్చినాటికల్లా ఈ పథకం పూర్తవుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రూ. 7,926కోట్లతో నిర్మించే సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలోని 9. 36లక్షల ఎకరాలకు సాగునీరు అందచేస్తామన్నారు. ఇప్పటికే వెయ్యిఎకరాల భూసేకరణ జరిగిందన్నారు.

మొక్కలకు జియోట్యాగింగ్

హరితహారం పథకం కింద జిల్లాలో 1. 60కోట్లమొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటి వరకు 1. 10కోట్ల మొక్కలు నాటామని ప్రతి మొక్కను జియో ట్యాగింగ్ చేస్తున్నామన్నారు. 'డబుల్ పథకంలో భాగంగా జిల్లాలో మొదటి, రెండో దశల్లో 5, 963 రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 80 ఇళ్ల నిర్మించామన్నారు. వచ్చే దసరా నాటికి వెయ్యి ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చేందుకు భద్రాచలం ఏరియా ఆసుపత్రి 100పడకల అదనపు, మణుగూరులో 100పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేశామన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు సైతం ఇప్పటి వరకు 836మందికి ఆర్థిక సహాయం అందచేసినట్లు తెలిపారు.

అర్హులందరికీ జీవాలు

గొర్రెల పథకంలో భాగంగా 11, 649మంది సభ్యులకు జీవాలు పంపిణీ చేస్తామని, ఇప్పటికే కొంతమంది లబ్దిదారులకు అందచేసినట్లు తెలిపారు. రాష్ట్రానికి నిరంతర విద్యుత్ను అందించడంలో జిల్లాలో కేటీపీఎస్‌లో ఏడోదశ ద్వారా 800 మెగావాట్లు, మణుగూరు పట్టణంలో 1080 మెగావాట్లవిద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రానికి రూ.51. 31కోట్ల వ్యయంతో నాలుగు రహదారుల నిర్మాణం చేపట్టామని, రెండు పనులు పూర్తయ్యాయని, మరో రెండు పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఎనిమిది రహదారుల నిర్మాణానికి రూ. 420.38కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు కేసీఆర్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 1904 కేసీఆర్ కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధన

జిల్లాలో 283 ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్‌మీడియంలో బోధన జరుగుతోందన్నారు. ట్రైకార్‌పథకం ద్వారా గిరిజనులకు జీవనోపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఖరీఫ్ సీజనల్‌లో రూ. 910.30కోట్ల రుణాలు అందించే లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటి వరకు 282.02కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. 'ఉపాధి' ద్వారా 43, 741 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. వీటిలో ఏడు వేల మరుగుదొడ్లు పూర్తి చేశామన్నారు. రైతుబంధు పథకం ద్వారా రూ.57లక్షలను మార్కెట్‌యార్డుల్లో వసతులు కల్పన, గోదాంల నిర్మాణానికి వెచ్చించినట్లు పేర్కొన్నారు. ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో గుడుంబాను నియంత్రించామన్నారు. గుడుంబాను విక్రయిస్తూ జీవిస్తున్న 112 మంది ఎస్సీలు, 92మంది ఎస్టీలు, 61 మంది బీసీలకు ఇతరులు ఎనిమిది మందికి జీవనోపాధికల్పించేందుకు ఒక్కొక్కరికి రూ.2లక్షలు మంజూరు చేశామన్నారు.

చెరువుకట్టలపై ఈత మొక్కలు

హరితహారం పథకం కింద 369చెరువుకట్టలపై రెండు లక్షల ఈతమొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పౌరసరఫరాల ఆధ్వర్యంలో జిల్లాలో 2.75లక్షల రేషన్‌కార్డుదారులకు ప్రతినెల 5.35వేల మెట్రిక్ టన్నుల బియ్యం అందచేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు మంత్రి జిల్లా పోలీసుల మార్చ్‌ఫాస్ట్‌ను తిలకించారు. పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం జిల్లాలోని సుమారు 150మంది వివిధశాఖల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఉత్తమసేవలు అందించిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. కార్యక్రమంలో కొత్తగూడెం, ఇల్లెందు ఎమ్మెల్యేలు జలగం వెంకటరావు, కోరం కనకయ్య, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, జాయింట్ కలెక్టర్ రాంకిషన్, జిల్లా ఎస్పీ అంబర్ కిషోర్‌ఝా, డీఆర్‌వో ఎస్. కిరణ్‌కుమార్, ఆర్డీవో రవీంద్రనాథ్, మునిసిపల్ ఛైర్‌పర్సన్ పులిగీత, కొత్తగూడెం ఎంపీపీ బాణోత్ కేస్లీ, డీఎస్పీ సురేందర్‌రావు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను అభినందించిన మంత్రి పద్మారావు

ఆంధ్రజ్యోతి,కొత్తగూడెం: మిషన్ కాకతీయ పనులు త్వరితగతిన చేపట్టినందుకు రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేసింది. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవానికి వచ్చిన ప్రొహిబిషనరీ ఎక్సైజ్‌శాఖా మంత్రి పద్మారావు ప్రగతి మైదానంలో కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందచేసి అభినందించారు. మరిన్ని అవార్డులు అందుకోవాలని, జిల్లాను మరింత వేగంగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైనందుకు కలెక్టర్‌ను మంత్రి అభినందించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే జలగం వెంకటరావు సైతం కలెక్టర్‌ను అభినందించారు.


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందచేసి అభినందిస్తున్న మంత్రి పద్మారావు

మహనీయుల త్యాగం వృథా కానివ్వం

కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

కొత్తగూడెంటౌన్: స్వాతంత్ర్య పోరాటంలో మహనీయుల త్యాగ ఫలం వృథా కానివ్వమని ప్రతి ఒక్కరూ వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు పిలుపునిచ్చారు. 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆయన జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలన్ని నిరుపేద వర్గాలకు అందజేసేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ఆ మహనీయుల త్యాగాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకుని దేశం గర్వించేలా సమాజానికి సేవలందించేందుకు ప్రతి ఒక ఉద్యోగి కృత నిశ్చయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా పౌరసంబంధాల కార్యాలయం, ఉద్యానవనశాఖ కార్యాలయం, జిల్లా సహకార బ్యాంక్, బీసీ సంక్షేమశాఖ కార్యాలయంతోపాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణ జరిపారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో శ్రీనివాస్, ఉద్యానవనశాఖ అధికారి జినుగు మరియన్న, సొసైటీ ఛైర్మన్ మండె వీరహన్మంతరావు పాల్గొన్నారు. కొత్తగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బానోతుకేస్లీ, జాతీయ జెండాను ఎగురవేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ పులి గీత జాతీయ జెండాను ఆవిష్కరించారు.


జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు


జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న డీపీఆర్వో

అభివృద్ధి, సంక్షేమంలో జిల్లా అగ్రగామి

ఉగాది నాటికి ఇంటింటికి తాగునీరు

'సీతారామ'తో ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం

ఖమ్మంలో స్వాతంత్ర్య దినోత్సవంలో మంత్రి తుమ్మల

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - ఖమ్మం)

రాష్ట్రప్రభుత్వం రూపొందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలులో జిల్లా రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచిందని ఆర్అండ్‌బీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. స్వాతంత్ర్య సమరంలో మహనీయుల త్యాగాల స్ఫూర్తిగా అభివృద్ధిలో మరింత ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన 71వ స్వాతంత్ర్య వేడుకలకు మంత్రి తుమ్మల ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మంత్రి ప్రసంగిస్తూ మహాత్మాగాంధీ, పండిట్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, ఆజాద్, భగత్‌సింగ్ వంటి మహనీయుల త్యాగాల ఫలితంగా మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామన్నారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. మూడేళ్ల క్రితం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో జిల్లా అగ్రగామిగా ఉందని మంత్రి పేర్కొన్నారు. హరితహారం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమంలా అమలు చేస్తున్నారని, జిల్లాలో 5కోట్ల 46లక్షల మొక్కలు నాటడమేగాకుండా వాటిని పరిరక్షించే చర్యలు కూడా చేపట్టామని, తద్వారా హరితహారంలో జిల్లా అగ్రగామిగా నిలిచిందన్నారు.


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

సీతారామతో సస్యశ్యామలం

దశాబ్దాలుగా ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం ఎదురుచూస్తున్న దుమ్ముగూడెం సీతారామ ప్రాజెక్టుకు పనులు రూ.8వేల కోట్లతో వేగంగా జరుగుతున్నాయన్నారు. ఇది పూర్తిచేసి 10లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తామని, తద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కరువు రక్కసి నుంచి విముక్తి లభించబోతోందన్నారు. భక్తరామదాసు ప్రాజెక్టును నిర్దేశించిన సమయానికి ముందే పూర్తి చేశామని గుర్తు చేశారు. జిల్లాలో రూ.572కోట్ల ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టిన సాగర్ ఆధునీకరణ పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. రూ.173కోట్లతో 697చెరువులను పునరుద్ధరించామన్నారు.

జిల్లాకు జాతీయ రహదారులు

జిల్లాలో జాతీయ, రాష్ట్రీయ రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రోడ్లు వేస్తున్నామన్నారు. జిల్లా కేంద్రం నుంచి రాజధానికి నాలుగు వరుస రోడ్ల నిర్మించబోతున్నామని మంత్రి తెలిపారు. రూ. 1601కోట్లతోమొత్తం రూ.1,713కి.మీ రహదారి విస్తరణ, వంతెనల పనులు జిల్లాలో జరుగుతున్నాయని మంత్రి వివరించారు. రూ.1700 కోట్లతో సూర్యాపేట- ఖమ్మం, కోదాడ-ఖమ్మం, ఖమ్మం-అశ్వారావుపేట కు జాతీయ రహదారులు నిర్మిస్తున్నామన్నారు. కొత్తగూడెం నుంచి సత్తుపల్లి రూ.704కోట్లతో 53కి.మీల రైల్వేలైన్ మంజూరైందన్నారు.

హెలికాప్టర్‌లో వచ్చిన మంత్రి తుమ్మల

ఇటీవల అస్వస్థతకుగురై చికిత్స అనంతరం హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనేందుకు మంగళవారం హైదరాబాద్ నుంచి ఖమ్మానికి హెలికాప్టర్‌లో వచ్చారు. ట్రైకార్ ఛైర్మన్ తాటి వెంకటేశ్వర్లుతో కలిసి ఉదయం 8.40కు పటేల్ స్టేడియానికి చేరుకున్నారు. మంత్రి తుమ్మలకు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, టీఆర్ఎస్ నాయకులు, ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి నేరుగా పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌కు వెళ్లి 9గంటలకు జాతీయ జెండాను ఎగురవేశారు. ఖమ్మంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనాన్ని ప్రారంభించిన అనంతరం మధ్యాహ్నం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్, డీసీసీబీ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబుతో కలిసి హెలికాప్టర్‌లో హైదరాబాద్ వెళ్లారు.

హలో..సింగరేణి

సీఎండీ ఆఫీస్, హైదరాబాద్
040-23393746
సీఎండీ ఆఫీస్, కొత్తగూడెం
08744-245601
డైరెక్టర్ ఫైనాన్స్ & పీఏడబ్ల్యూ
08744-243021
డైరెక్టర్ ఆపరేషన్స్
08744-242328
డైరెక్టర్ పీఏడబ్ల్యూ ఆఫీస్
08744-245606
డైరెక్టర్ ఈ అండ్ ఎం
08744-245005
డైరెక్టర్ పీపీ
08744-242602
జీఎం పర్సనల్ ఐఆర్
08744-245967

కొత్తగూడెంలో..



సివిల్ భవనం ఆవరణలో మొక్క నాటిన సింగరేణి సీఎండీ శ్రీధర్

ఉత్తమ అధికారులు, కార్మికులకు సన్మానాలు

















కొత్తగూడెంలో జరిగిన ఉత్సవాల్లో విద్యార్థుల ప్రదర్శన

తిరంగా రెపరెపలు

సింగరేణి వ్యాప్తంగా స్వాతంత్ర్య సంబురాలు ఘనంగా జరిగాయి. కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, సత్తుపల్లి ప్రాంతాల్లో అధికారులు జాతీయజెండాను ఆవిష్కరించారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగిన ఉత్సవాల్లో ఉత్తమ అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఇల్లెందుటౌన్: కలసి శ్రమించి, సింగరేణి ఖ్యాతి చాటుదామని సింగరేణి జీఎం కందుకూరి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన మాట్లాడారు.ఇల్లెందు ఏరియాకు మరో 50 ఏళ్ల పాటు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా కొనసాగించేందుకు సింగరేణి యాజమాన్యం తగిన ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. రాబోయే కాలంలో ఇల్లెందు ఏరియా మనుగడకు ఎలాంటి ఢోకా ఉండదని ప్రకటించారు. 71 ఏళ్ల స్వాతంత్ర్యంలో అనేక రంగాల్లో అభివృద్ధి జరిగిందని, సింగరేణి కాలరీస్ సంస్థ సాటిలేని ప్రగతి సాధించిందన్నారు. ఇల్లెందు డివిజన్ లోని బొగ్గు గనుల్లో, కార్యాలయాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జేకే కాలనీ, సీఈఆర్ క్లబ్‌లో జరిగిన సంబరాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జీఎం కందుకూరి లక్ష్మీనారాయణ సింగరేణి లక్ష్యాలను సాధించేందుకు కార్మికులు మరింత కృషి చేయాలని కోరారు. ఏరియాలో ఉత్తమ కార్మికులుగా ఎంపికైన వారిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు సరళాదేవి, సింగరేణి ఎస్‌వోటూ జీఎం మల్లేలసుబ్బారావు, ఏజెంట్ బొల్లం వెంకటేశ్వర్లు, సీఎంవో అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ లక్ష్మీనారాయణ, కార్మిక సంఘాల నాయకులు ఎల్. జగన్నాధం, కే. సారయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, జాతినేతల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

మహనీయుల త్యాగఫలం వృథా కాకూడదు

మణుగూరు: స్వాతంత్ర్య సాధన కోసం అమరులైన మహనీయుల త్యాగఫలాలను వృథా కానీయకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏరియా జీఎం చిలుకూరి నర్సింహారావు అన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో మంగళవారం 71వ స్వాతంత్ర్య ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పివి కాలనీ కమ్యూనిటీ హాల్లో జరిగిన వేడుకల్లో జీఎం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మహనీయులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీఉద్యోగి బాధ్యతతో మెలుగుతూ.. ఉత్పత్తి-ఉత్పాదకతల సాధనకు కృషి చేయాలని కోరారు. అనంతరం సీఎంవోఏఐ కార్యదర్శి రాజారమేష్, ఏరియా పర్సనల్ మేనేజర్ ఆర్ సీతారాం మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఫలాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ఉత్తమ కార్మికులను అతిథుల చేతులమీదుగా ఘనంగా సత్కరించారు. జ్ఞాపికలను, ప్రశంసాపత్రాలను అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. చిన్నారుల గాంధీజీ, భారత మాత వేషధారణలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను కాపాడండి: సీఎండి శ్రీధర్

ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం: పరిసరాల పరిశుభ్రతను కాపాడాలని.. మొక్కలను పెంచాలని నాటిన మొక్కకు రక్షణ చర్యలు చేపట్టాలని సింగరేణి సీఅండ్ఎండి ఎన్. శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛపక్వాడ్ కార్యక్రమాన్ని కొత్తగూడెంలో మంగళవారం ఆయన ప్రారంభించారు. సివిల్‌బిల్డింగ్ డిపార్టుమెంట్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని సింగరేణి వ్యాప్తంగా అధికారికంగా సీఅండ్ఎండి ప్రకటించారు. సింగరేణి అన్ని ఏరియాలు, కాలనీల్లో, గనులు, ఆసుపత్రులు, విద్యాలయాల్లో ఈ పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టాలని కూడ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ఈ నెల 30వ తేదీ వరకు సింగరేణి వ్యాప్తంగా స్వచ్ఛపక్వాడ్ కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఇల్లెందుటౌన్: ఇల్లెందులో స్వచ్ఛపక్వాడ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఈఆర్ క్లబ్ ఆవరణలో జీఎం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జీఎం కందుకూరి లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కార్మికసంఘాల నాయకులు పాల్గొన్నారు.

వేడుకల్లో భూ నిర్వాసితుల నిరసన..

ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం:సింగరేణి ప్రకాశం స్టేడియం గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో తమకు న్యాయం చేయాలని భూనిర్వాసిత కుటుంబాలకు చెందిన అభ్యర్థులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఎస్టీ అభ్యర్థులతో భర్తీకావాల్సిన 665బదిలీ వర్కర్ల ఉద్యోగా ల్లో న్యాయం చేయాలని నినదించారు. ఆవరణలోనే కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. ఇల్లెందు జేకే5 ఓపెన్‌కాస్టు గని కింద భూములు కోల్పోయిన తమకు నష్టపరిహారం, ఉద్యోగాలు ఇవ్వలేదని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తొమ్మిదేళ్లుగా తమను పట్టించుకోవడం లేదని స్వాతంత్ర్య దినోత్సవం రోజైన మాకు న్యాయం చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. అక్కడే ఉన్న సింగరేణి సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది, పోలీసులు జోక్యం చేసుకుని నివారించబోయారు. అయినప్పటికీ యువకులు నినాదాలు చేస్తూనే ఉన్నారు. దీంతో వెంటనే సింగరేణి డైరెక్టర్ (పా) పవిత్రన్ కుమార్‌తోపాటు సింగరేణి జీఎంలు ఆనందరావు, మసుద్ ముజాహిద్, బసవయ్య తదితర అధికారులు ఆందోళనకారుల వద్దకు వెళ్లి మాట్లాడారు. దీంతో సింగరేణి అధికారులకు వినతిపత్రం అందచేశారు.



ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

ఇల్లెందులో...



మొక్కలు నాటుతున్న జీఎం



ఉత్తమ కార్మికుడు వెంకటరెడ్డికి సన్మానం



హాజరైన కార్మిక కుటుంబాలు

మణుగూరులో..



జెండా ఆవిష్కరిస్తున్న జీఎం నర్సింహారావు



ఉత్తమ కార్మికుడికి సన్మానం



చిన్నారుల ప్రదర్శనలు



'గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి కృషిచేయాలి'

అశ్వారావుపేట రూరల్: గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధి కోసం కృషిచేయాలని ఎస్‌సీఆర్‌పీ కంగాల వీరభద్రం కోరారు. మండలంలోని నల్లబాడు గిరిజన పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆయన ఏకరూప దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జైబోలో స్వతంత్ర్య భారత్‌కీ..

- వాడవాడలా ఎగిరిన మువ్వన్నెల జెండా
- ఘనంగా పంద్రాగస్టు వేడుకలు


ఆర్టీవో చెక్‌పోస్ట్ దగ్గర జెండా వందనం


చంద్రుగొండ పోలీస్‌స్టేషన్‌లో


అన్నపురెడ్డిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో


దమ్మపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


పేట అగ్నిమాపక కేంద్రంలో..


విద్యార్థులకు నగదు అందజేస్తున్న దృశ్యం

నియోజకవర్గ వ్యాప్తంగా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. మంగళవారం 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యాలయాల్లో, విద్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతీ హృదయంలో దేశభక్తి నిరంతరం వెలగాలని ఆకాంక్షించారు.

అశ్వారావుపేట, అశ్వారావుపేట టౌన్: అశ్వారావుపేట పట్టణం, మండల వ్యాప్తంగా మంగళవారం స్వాతంత్ర దిన వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణం లోని ఎంపీడీవో, కార్యాలయంలో ఎంపీపీ బరెగడ కృష్ణ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పలు కార్యాలయాల్లో బాధ్యులు, పంచాయతీల్లో ఆయా సర్పంచ్‌లు, సంఘాల నాయకులు జెండాలను ఆవిష్కరించారు. నారాయణపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన రిటైరైన ఉద్యోగి, ప్రస్తుతం హైదరాబాదులో నివాసం ఉంటున్న చందా వెంకట్రామయ్య నగదు పారితోష కాన్ని అందజేశారు.

దమ్మపేట: స్వాతంత్ర్య దిన వేడుకలు మండలవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. మండల ప్రజా పరిషత్ కార్యాలయం, సహకార సంఘం కార్యాలయాల్లో ఎంపీపీ అల్లం వెంకమ్మ, సహకార సంఘం అధ్యక్షుడు ఆలపాటి ప్రసాద్ జెండాను ఎగరవేశారు. కార్యాలయాల్లో ఆయా బాధ్యులు జెండాను ఆవిష్కరించారు. 32 అడుగుల జాతీయ జెండాతో దమ్మపేట గీతాంజలి విద్యాలయం విద్యార్థులు వీధుల్లో నినాదాలతో ప్రదర్శన నిర్వహించారు.

చంద్రుగొండ: చంద్రుగొండ మండల వ్యాప్తంగా పంద్రాగస్టు వేడుకలు ఘనంగా జరిగాయి. పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ ప్రసాద్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో తహసీల్దార్ కనకదుర్గ, ఎంపీపీ బాలునాయక్ పతాకాన్ని ఆవిష్కరించారు. చంద్రుగొండ జడ్పీ పాఠశాలలో గతేడాది పదోతరగతిలో అధిక మార్కులు సాధించిన రజియా షహనాజ్, గణేష్‌లకు నేరేళ్లకుంట హన్మంతరావు, లక్ష్మీనర్సమ్మల జ్ఞాపకార్థంగా వారి కుటుంబసభ్యులు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని అన్ని గ్రామాలల్లో స్వాతంత్ర దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మాలతి, ఎస్ఐ.నరేష్ పతాకావిష్కరణ చేశారు.

ములకలపల్లి: మండలంలో 71వ స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాంనరేష్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కుర్సం శాంతమ్మ, పలు కార్యాలయాల్లో ఆయా శాఖల బాధ్యులు జెండా ఆవిష్కరించారు.


మామిళ్లవారిగూడెంలో...


అశ్వారావుపేట ఎంపీడీవో కార్యాలయంలో..


అన్నపురెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్‌లో..


ములకలపల్లిలో..

ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు

అశ్వారావుపేట రూరల్: మండలంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఆరుగురు ఉద్యోగులకు ఉత్తమ ఉద్యోగులుగా అవార్డులు దక్కాయి. స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి అవార్డులు అందుకున్నారు. వైద్యఆరోగ్యశాఖలో సబ్‌యూనిట్ అధికారిగా పనిచేస్తున్న ఆసుపాక గ్రామానికి చెందిన ఆజ్మీర వెంకటేశ్వర్‌రావు ఏజన్సీలో ఉత్తమ సబ్‌యూనిట్ అధికారిగా అవార్డు అందుకున్నారు. భద్రాచలంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సున్నం రాజయ్య, ఇతర ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. మహిళా శిశుసంక్షేమశాఖకు సంబంధించి అనంతారం అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న కె.పాపమ్మ జిల్లాలో ఉత్తమ సేవకురాలిగా ఎంపిక య్యారు. అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే కార్యక్రమాల్లో విశేషంగా సేవలు అందిస్తున్న ఈమె మొదటిసారి అవార్డును అందుకున్నారు. అశ్వారావుపేట ఉద్యానశాఖలో పనిచేస్తున్న హెచ్‌వో ఉదయ్‌కుమార్ మరోసారి జిల్లాస్థాయిలో ఉత్తమ హెచ్‌వోగా అవార్డు పొందారు. అశ్వారావుపేట మండల పరిషత్తు కార్యాలయంలో లక్కినేని ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యారు. 108లో పనిచేస్తున్న ఈఎంటీ సీహెచ్.రాము, పైలెట్ ఉపేంద్ర ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికయ్యారు. వీరంతా జిల్లా కేంద్రం కొత్తగూడెంలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఎక్సైజ్‌శాఖ మంత్రి పద్మారావు, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన నలుగురు ఉద్యోగులకు తోటిఉద్యోగులు, సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.


ఎమ్మెల్యే రాజయ్య నుంచి అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వర్‌రావు

ములకలపల్లి: మండల కేంద్రంలోని మంగపేట గిరిజన వైద్యఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా (ఎల్‌టీ) విధులు నిర్వర్తిస్తున్న ఇ. ఇబినైజర్‌కు జిల్లాస్థాయిలో ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసలు లభించాయి. స్వాతంత్ర్య దిన వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి పద్మారావు గౌడ్ ప్రశంసాపత్రం అందించారు.

'రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి'

చంద్రుగొండ: నాయీ బ్రాహ్మణులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దడిగెల మల్లేష్ డిమాండ్ చేశారు. మంగళవారం చంద్రుగొండలో ఆ సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సోములపల్లిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాదాయశాఖలో పని చేస్తున్న నాయీ బ్రాహ్మణులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. నూతనంగా ఎంపికైన అధ్యక్షులు మధును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె. సత్యనారాయణ, నాయకులు కె. పున్నం, సైదులు, నర్సింహారావు, పుల్లయ్య, వెంకటి పాల్గొన్నారు.


మండల అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

కాళేశ్వరస్వామికి
వెండి నామాలు బహూకరణ

అశ్వారావుపేట: వినాయకపురంలో ప్రసిద్ధిచెందిన శ్రీ కాళేశ్వరస్వామికి అశ్వారావుపేటకు చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి జల్లిపల్లి నారాయణరావు వెండి నామాలను సమర్పించారు. మంగళవారం నారాయణరావు కుటుంబ సభ్యులతో ఆలయానికి వచ్చి 600 గ్రా. బరువుతో స్వామివారికి తయారు చేయించిన వెండి నామాలను స్వామివారికి సమర్పించి, అలంకరించారు. కార్యక్రమంలో బిర్రం వెంకటేశ్వరరావు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

'పేట'లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు

- స్వాతంత్ర్య దినాన గ్రామాల్లో జోరుగా అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు

అశ్వారావుపేట: జాతీయ పండుగైన స్వాతంత్రదినోత్సవం రోజున మండలంలోని అన్ని గ్రామాల్లోని బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు యదేచ్ఛగా సాగాయి. నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు ఆ వైపుకు కన్నెత్తిచూడలేదు. కనీసం మండలంలో ఎక్కడా సంబంధిత అధికారుల జాడే కనిపించలేదు. దీంతో మద్యం అమ్మకాలు లక్షల్లో జరిగిపోయాయి. స్వాతంత్ర దినోత్సవం రోజున మద్యం, మాంసం విక్రయాలు నిషేధం. మండలంలో అందుకు భిన్నంగా మద్యం అమ్మకాలు జరగడంపై ప్రజలు బహిరంగంగానే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

ముగ్గురిపై కేసు నమోదు

ములకలపల్లి: గుట్టుగా గుట్కా ప్యాకెట్లు నిల్వ ఉంచుకొని విక్రయాలు జరుపుతున్న కిరాణ షాపులపై ఎస్ఐ ఎల్. రవీందర్ సోమవారం రాత్రి సిబ్బందితో దాడులు జరిపి పట్టుకున్నారు. ములకలపల్లి, జగన్నాథపురం గ్రామాల్లో ఓబిలిశెట్టి ప్రదీప్, వొంటిపల్లి సత్యప్రసాద్, సముద్రాల నాగేశ్వరరావుల కిరాణా షాపుల్లో గుట్కా ప్యాకెట్లు నిల్వ ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ రవీందర్ సిబ్బందితో ముగ్గురి షాపులపై దాడులు నిర్వహించగా వారి వద్ద నుంచి 16,500గుట్కాప్యాకెట్లు పట్టుబడ్డాయి. వీటి విలువ సుమారు రూ. 80వేలు ఉంటుందని, ముగ్గురి నిందితులపై కేసు నమోదు చేసి గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ పుల్లారావు, కానిస్టేబుల్స్ నర్సింహారావు, రామ్మూర్తి తదితులు పాల్గొన్నారు.


నిందితులతో పోలీసులు

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

దమ్మపేట: పేకాట స్థావరంపై దమ్మపేట ఎస్ఐ ప్రవీణ్ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం దాడి చేశారు. నాచారం గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేసినట్టు ఎస్ఐ తెలిపారు. దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారివద్ద నుంచి రూ.20వేలను స్వాధీనం చేసుకున్నట్లు ప్రవీణ్ విలేకరులకు తెలిపారు.

KIND : JLHJMOCE :: BEST : ------

పోలిక పరీక్ష

మోడల్ - 2

1. **GAME: EmAg :: PLAY : -------**
ఎ) YaLp బి) YAlp సి) yalP డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: Game పదాన్ని అపసవ్య దిశలో మొదట పెద్ద అక్షరం, తదుపరి చిన్న అక్షరం విధానంలో రాశారు. అలాగే PLAYను అపసవ్య దిశలో మొదట పెద్ద అక్షరం, తరవాత చిన్న అక్షరం రాస్తే YaLp సమాధానమవుతుంది.

2. **RENT: UOFS :: SOFT : --------**
ఎ) UHQT బి) VGQT సి) UGPT డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: RENTకు+1 చేస్తే R +1 = S, E+1 =F, N + 1 = O, T+ 1 = U అంటే SFOU. దీనిని రివర్స్ ఆర్డర్‌లో రాస్తే UOFS అయింది. అలాగే SOFT కు +1 చేస్తే తదుపరి అక్షరాలు S+ 1 = T, O + 1 = P, F + 1 = G, T + 1 = U, అంటే TPGU. దీని రివర్స్ ఆర్డర్‌లో రాస్తే UGPT సమాధానమవుతుంది.

3. **KIND : JLHJMOCE :: BEST : ------**
ఎ) ACDERSTU బి) ACDFRTSU
సి) AFCDRSTU డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: K కు వెనక, తదుపరి అక్షరాలు J L
I కు వెనక, తదుపరి అక్షరాలు H J
N కు వెనక, తదుపరి అక్షరాలు M O
D కు వెనక, తదుపరి అక్షరాలు C E
వీటిని వరసగా రాస్తే JLHJMOCE
అలాగే BEST లోని ప్రతి అక్షరానికి వెనక, తదుపరి అక్షరాలు రాస్తే ACDFRTSU సమాధానమవుతుంది.

4. **FOUND: ENTMC :: GIVEN : -----**
ఎ) FHUDM బి) EGVCM
సి) FHVCM డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: FOUND పదంలోని ప్రతి అక్షరానికి -1 చేయాలి. అంటే అక్షరం వెనక అక్షరం రాయగా
F-1= E, O-1= N, U-1 = T, N-1 = M, D- = C అంటే ENTMC
అలాగే GIVENలో ప్రతి అక్షరానికి - 1/వెనక అక్షరం రాస్తే
G - 1 = F, I - 1 = H, V - 1 = U, E - 1 = D, N - 1 = M
FHUDM సమాధానమవుతుంది.

5. **SMILE : DKHLR :: EXIST : -------**
ఎ) RSHWD బి) SRHWD
సి) RSHDW డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: SMILE పదంలోని ప్రతి అక్షరానికి వెనక



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

అక్షరం రాస్తే
S - 1= R, M- 1 = L, I - 1 = H, L- 1 = K, E - 1 = D
అంటే RLHKD దీనిని రివర్స్‌లో రాస్తే DKHLR అయింది. అలాగే EXIST పదంలోని ప్రతి అక్షరానికి వెనక అక్షరం రాసి తరవాత వాటిని రివర్స్‌లో రాస్తే SRHWD సమాధానమవుతుంది.

6. **MAP : 30 :: AIM : --------**
ఎ) 23 బి) 24 సి) 26 డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: MAPలో M అంటే 13వ అక్షరం. A అంటే మొదటి అక్షరం. P అంటే 16వ అక్షరం. 13+1+16= 30. అలాగే AIMలో A అంటే మొదటి అక్షరం, I అంటే 9వ అక్షరం, M అంటే 13వ అక్షరం కాబట్టి 1 + 9 + 13 = 23 సమాధానమవుతుంది.

7. **EXAM: VCZN :: NOTE :-------**
ఎ) MLGV బి) GLVM
సి) GLMV డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: సవ్యదిశలో అయిదో అక్షరం E
అపసవ్య దిశలో అయిదో అక్షరం V
సవ్యదిశలో 24వ అక్షరం X
అపసవ్యదిశలో 24వ అక్షరం C
సవ్యదిశలో మొదటి అక్షరం A
అపసవ్యదిశలో మొదటి అక్షరం Z
సవ్యదిశలో 13వ అక్షరం M
అపసవ్యదిశలో 13వ అక్షరం N
అలాగే NOTEకు అపసవ్యదిశలో ఆయా సంఖ్యల అక్షరాలు రాస్తే MLGV సమాధానమవుతుంది

8. **CALM : 158 :: LONG: --------**
ఎ) 130 బి) 148 సి) 120 డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: అపసవ్యదిశలో 24 వ అక్షరం C
అపసవ్యదిశలో 26 వ అక్షరం A
అపసవ్యదిశలో 15 వ అక్షరం L
అపసవ్యదిశలో 14వ అక్షరం M
24 + 26 + 15 + 14 = 79. దీనికి రెట్టింపు 158
అలాగే LONG లోని అక్షరాలకు అపసవ్యదిశలో సంఖ్యలు వరసగా
15 + 12 + 13 + 20 = 60. దీనికి రెట్టింపు 120

9. **PARTNER: OBPUKFN :: CREATOR : -------**
ఎ) BSCBNPQ బి) BSCBQPN
సి) BBCSPQN డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ:

16	1	18	20	14	15	18	3	18	5	1	20	15	18
P	A	R	T	N	E	R	C	R	E	A	T	O	R
-1	+1	-2	+1	-3	+1	-4	-1	+1	-2	+1	-3	+1	-4
O	B	P	U	K	F	N	B	S	C	B	Q	P	N
15	2	16	21	11	6	14	2	19	3	2	17	16	4

10. **MISTAKE : IAEMSTK :: TEACHER: -------**
ఎ) EAETCHR బి) TACHEER
సి) ACETEHE డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: MISTAKE పదంలో అచ్చులకు (A, E, I, O, U) సంబంధించిన అక్షరాలను ముందుగా, తదుపరి మిగిలిన అక్షరాలు రాశారు. అలాగే TEACHER పదంలో అచ్చుల అక్షరాలు ముందుగా రాసి తరవాత మిగిలిన అక్షరాలు రాస్తే EAETCHR సమాధానమవుతుంది

11. **COUSIN: NSOCUI :: REASON:--------**
ఎ) NRSEAO బి) AESONR
సి) NSERAO డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ:

1	2	3	4	5	6	6	4	2	1	3	5
C	O	U	S	I	N	N	S	O	C	U	I
1	2	3	4	5	6	6	4	2	1	3	5
R	E	A	S	O	N	N	S	E	R	A	O

12. **KING : TMRP :: NIKE : ------**
ఎ) PRVM బి) VPRM సి) PRMY d) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: KING పదాన్ని రివర్స్‌లో రాస్తే GNIK ఇప్పుడు
సవ్య దిశలో ఏడో అక్షరం G
అపసవ్యదిశలో ఏడో అక్షరం T
సవ్యదిశలో 14వ అక్షరం N
అపసవ్యదిశలో 14వ అక్షరం M
సవ్యదిశలో 9వ అక్షరం I
అపసవ్యదిశలో 9వ అక్షరం R
సవ్యదిశలో 11వ అక్షరం K
అపసవ్యదిశలో 11వ అక్షరం P
ఇప్పుడు KING పదం TMRP గా మారింది
అలాగే NIKE పదాన్ని రివర్స్‌లో రాయగా EKIN వస్తుంది. ఇప్పుడు
సవ్యదిశలో 5వ అక్షరం E
అపసవ్యదిశలో 5వ అక్షరం V
సవ్యదిశలో 11వ అక్షరం K
అపసవ్యదిశలో 11వ అక్షరం P
సవ్యదిశలో 9వ అక్షరం I
అపసవ్యదిశలో 9వ అక్షరం R
సవ్యదిశలో 14వ అక్షరం N
అపసవ్యదిశలో 14వ అక్షరం M
కాబట్టి VPRM సమాధానమవుతుంది

13. **EAR : 90 :: BIG : --------**
ఎ) 126 బి) 128 సి) 104 డి) 118
సమాధానం: ఎ
వివరణ: EAR పదంలో వర్ణమాల ప్రకారం E అంటే 5వ అక్షరం. A అంటే మొదటి అక్షరం. R అంటే 18వ అక్షరం. 5, 1, 18 లను గుణించగా 90 వస్తుంది. అలాగే BIG పదంలో B అంటే 2వ అక్షరం, I అంటే 9వ అక్షరం, G అంటే 7వ అక్షరం. 2, 9, 7 లను గుణించగా 126 వస్తుంది. సమాధానం 126

14. **SMILE : TOLPJ :: LAUGH : --------**
ఎ) CKMMX బి) MCXKM
సి) CXKMM డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ:

19	13	9	12	5	12	1	21	7	8
S	M	I	L	E	L	A	U	G	H
+1	+2	+3	+4	+5	+1	+2	+3	+4	+5
T	O	L	P	J	M	C	X	K	M
20	15	12	16	10	13	3	24	11	13

15. **ICE: HAB::BIG : -------**
ఎ) AGD బి) DAG సి) GAD డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ:

9	3	5	2	9	7
I	C	E	B	I	G
-1	-2	-3	-1	-2	-3
H	A	B	A	G	D
8	1	2	1	7	4

16. **TABLE : UDGSN :: CHAIR: ----------**
ఎ) DKERAG బి) DKFPA
సి) DKFPZ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ:

20	1	2	12	5	3	8	1	9	18
T	A	B	L	E	C	H	A	I	R
+1	+3	+5	+7	+9	+1	+3	+5	+7	+9
U	D	G	S	N	D	K	F	P	A
21	4	7	19	14	4	11	6	16	27

గమనిక: Z తరవాత A ను 27వ అక్షరంగా భావిస్తారు

మోడల్ - 3

సంఖ్యలతో పోలిక పరీక్ష

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో ఒక అంకెను దానికి ఒక రకమైన సంబంధాన్ని ఇస్తారు. మరో అంక ఇచ్చి ఆ అంకెకు కూడా అలాంటి సంబంధాన్నే తెలపమని అడుగుతారు.

1. **5: 125 :: 7: --------**
ఎ) 348 బి) 369 సి) 343 డి) 386
సమాధానం: సి
వివరణ: 5కి ఘనం 125 అలాగే 7 కి ఘనం 343

2. **11: 132 :: 14 : --------**
ఎ) 210 బి) 228 సి) 232 డి) 248
సమాధానం: ఎ
వివరణ: 11^2 + 11 = 121 + 11 = 132 అలాగే 14^2 + 14 = 196 + 14 = 210

3. **20:44:: 35: ---------**
ఎ) 85 బి) 74 సి) 88 డి) 92
సమాధానం: బి
వివరణ: 20 x 2 +4 = 44 అలాగే 35 x 2 +4 = 74 సమాధానమవుతుంది

4. **5:120:: 8: --------**
ఎ) 502 బి) 512 సి) 508 డి) 504
సమాధానం: డి
వివరణ: 5 ఘనం 5^3 - 5 = 125 - 5= 120 అలాగే 8^3 - 8= 512 - 8 = 504

5. **3:27 :: 5: --------**
ఎ) 120 బి) 125 సి) 315 డి) 425
సమాధానం: బి
వివరణ: 27 అనేది 3కి ఘనం అలాగే 125 అనేది 5కి ఘనం

6. **I + K : 60 :: L + T : ----------**
ఎ) 96 బి) 99 సి) 105 డి) 120
సమాధానం: ఎ
వివరణ: I + K అంటే 9 + 11 = 20. 20x3 = 60 I అంటే 9వ అక్షరం, K అంటే 11 వ అక్షరం అలాగే L + T అంటే 12 + 20 = 32. 32x 3= 96
L అంటే 12 వ అక్షరం, T అంటే 20 వ అక్షరం

7. **3: 81 :: 4 : ----------**
ఎ) 196 బి) 240 సి) 128 డి) 256
సమాధానం: డి
వివరణ: 3 x 3 x3 x 3 = 81 అలాగే 4 x 4 x 4 x 4 = 256

ఉద్యోగాలు

ముంబై పోర్ట్ ట్రస్ట్

ముంబై పోర్ట్ ట్రస్ట్ స్పోర్ట్స్ క్లబ్ - స్పోర్ట్స్ ట్రైనీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు: 56**
గేమ్స్ వారీ ఖాళీలు: అథ్లెటిక్స్ 5, షటిల్ బ్యాడ్మింటన్ 3, బాడీ బిల్డింగ్ 2, క్రికెట్ 8, ఫుట్‌బాల్ 9, హాకీ 9, కబడ్డీ 7, టేబుల్ టెన్నిస్ 2, వాలీబాల్ 6, వెయిట్ లిఫ్టింగ్ 5
అర్హత: ఆయా స్పోర్ట్స్ విభాగాలకు సంబంధించి జాతీయ/ అంతర్జాతీయ స్థాయిల్లో (2014, 2015, 2016 సంవత్సరాల్లో) పార్టిసిపేట్ చేసి ఉండాలి.
వయసు: ఆగస్టు 10 నాటికి 18 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి. ఎంపికైన ట్రైనీ స్పోర్ట్స్ అభ్యర్థులకు స్టయిపెండ్ కింద నెలకు రూ.15,000 + కిట్ రూ.10,000(ఏడాదికి) + మెడిక్లెయిమ్ + యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ రూ.3,500(ఏడాదికి) చెల్లిస్తారు. షేరింగ్ బేసిస్ మీద నివాస సౌకర్యం కల్పిస్తారు.
దరఖాస్తు ఫీజు: రూ.100
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 31
చిరునామా: Jt General Secretary Mumbai Port Trust Sports Club, 2nd Floor, Railway Managers Building, Ramjibhai Jamani Marg, Near Vasant hotel, Ballard Estate, Mumbai - 400001
వెబ్‌సైట్: http://mumbaiport.gov.in

నిట్ రూర్కెలా

రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)- **టీచింగ్ పోస్టుల** భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు: 203**
పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్
అర్హత: బిఇ/ బిటెక్/ బిఆర్క్/ ఎం ఆర్క్/ ఎంబిఏ/ పీజీడిబిఎంతోపాటు పిహెచ్‌డి పూర్తిచేసి ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష, టెక్నికల్, పర్సనల్ ఇంటర్వ్యూ
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 11
వెబ్‌సైట్: www.nitrkl.ac.in

ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలో ఎక్కడ పొందుపరిచారు?

ప్రాథమిక హక్కులు

1. మానవుడు సంపూర్ణంగా, పరిపూర్ణంగా సర్వతోముఖాభివృద్ధి చెందడానికి ఏవి ఉపయోగపడతాయి?
ఎ) ప్రాథమిక హక్కులు బి) ప్రాథమిక విధులు
సి) ఆదేశిక సూత్రాలు డి) ఏదీకాదు

2. ఒక రాజ్యం లక్షణం, స్వభావం అది ప్రజలకు అందించే హక్కుల ఆధారంగా తెలుస్తుందని ఎవరు పేర్కొన్నారు?
ఎ) మహాత్మాగాంధీ బి) నెహ్రూ
సి) హెచ్.జె.లాస్కీ డి) జె.డబ్ల్యూ.గార్నర్

3. ప్రాథమిక హక్కులు సాధారణ చట్టాల కంటే అత్యున్నతమైనవి అని పేర్కొన్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి?
ఎ) హెచ్.జె.కానియా బి) కె.జి.బాలకృష్ణన్
సి) పతంజలిశాస్త్రి డి) ఎవరూ కాదు

4. జాతీయ ఉద్యమ కాలంలో 'స్వరాజ్' అనే బిల్లును (1895) ప్రతిపాదించి అందులో భారతీయులకు 'వాక్, భావ ప్రకటన' స్వేచ్ఛలను అందించాలని తొలిసారి డిమాండ్ చేసింది?
ఎ) అనిబిసెంట్ బి) మహాత్మాగాంధీ
సి) సర్దార్ వల్లభాయ్ పటేల్ డి) తిలక్

5. 1925లో 'Common wealth of India' అనే బిల్లును ప్రతిపాదించి అందులో ఐరిష్ రిపబ్లికన్లకు అందించిన హక్కులను భారతీయులకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేసింది ఎవరు?
ఎ) అనిబిసెంట్ బి) బాలగంగాధర్ తిలక్
సి) గాంధీ డి) సర్దార్ వల్లభాయ్ పటేల్

6. భారతీయులకు ప్రాథమిక హక్కులు కల్పించాలని ఏ సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ (1931) తొలిసారిగా డిమాండ్ చేసింది?
ఎ) మద్రాస్ సమావేశం బి) కరాచీ సమవేశం
సి) కలకత్తా సమావేశం డి) ఏదీకాదు

7. 1935 భారత ప్రభుత్వ చట్టంలో కొన్ని ప్రాథమిక హక్కులను బ్రిటిషర్లు భారతీయులకు అందిస్తుండగా అడ్డుకొన్నవారు?
ఎ) మింటో - మార్లే బి) మాంటెగ్ - చెమ్స్‌ఫర్డ్
సి) లార్డ్ రీడింగ్ - సర్‌జాన్ సైమన్
డి) గాంధీ - అంబేద్కర్

8. 1944-45లో ప్రాథమిక హక్కుల పరిశీలనపై జాతీయ కాంగ్రెస్ ఎవరి అధ్యక్షతన ఒక సమన్వయ సంఘాన్ని ఏర్పాటు చేసింది?
ఎ) సర్ తేజ్‌బహదూర్ సప్రూ బి) పటేల్
సి) అనిబిసెంట్ డి) బాలగంగాధర్ తిలక్

9. రాజ్యాంగ పరిషత్తు ఎవరి అధ్యక్షతన ప్రాథమిక హక్కుల సలహా సంఘాన్ని ఏర్పాటు చేసింది?
ఎ) జె.బి.కృపలాని బి) బి.ఎన్.రావ్
సి) నెహ్రూ డి) సర్దార్ వల్లభాయ్ పటేల్

10. ప్రాథమిక హక్కుల సలహా సంఘాన్ని రాజ్యాంగ పరిషత్తు ఎప్పుడు ఏర్పాటు చేసింది?
ఎ) 1946 బి) 1947 సి) 1948 డి) 1949

11. ప్రాథమిక హక్కుల సలహా సంఘంలో సభ్యుల సంఖ్య?
ఎ) 54 బి) 64 సి) 55 డి) 65

12. ప్రాథమిక హక్కుల ఉపసలహా సంఘం అధ్యక్షుడు?
ఎ) బి.ఎన్.రావ్ బి) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
సి) కె.ఎం.మున్షీ డి) జె.బి.కృపలాని

13. ప్రాథమిక హక్కులను రాజ్యాంగ నిర్మాతలు ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) అమెరికా బి) రష్యా సి) ఫ్రాన్స్ డి) ఐర్లాండ్

14. ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలో ఎక్కడ పొందుపరిచారు?
ఎ) 1వ భాగం 1-4 ఆర్టికల్స్
బి) 2వ భాగం 5-11 ఆర్టికల్స్
సి) 3వ భాగం 12-35 ఆర్టికల్స్
డి) 4వ భాగం 36-51 ఆర్టికల్స్

15. జాతీయ అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక హక్కులను తాత్కాలికంగా రద్దు చేసే అధికారం ఎవరికి ఉంది?
ఎ) పార్లమెంట్ బి) రాష్ట్రపతి
సి) సుప్రీంకోర్టు డి) కేంద్ర ప్రభుత్వం



కొమ్ము సుందర్‌రాజు

16. ఏ ప్రాథమిక హక్కు ఐదు అధికరణలను కలిగి ఉంది?
ఎ) సమానత్వపు హక్కు
బి) స్వాతంత్ర్యపు హక్కు
సి) మతస్వాతంత్ర్యపు హక్కు
డి) పీడనాన్ని నిరోధించే హక్కు

17. రాజ్యాంగం పౌరుడికి కల్పించిన ప్రాథమిక హక్కులు ఎన్ని?
ఎ) 5 బి) 6 సి) 7 డి) 8

18. ఆస్తి హక్కును ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు?
ఎ) 1976, 42వ రాజ్యాంగ సవరణ చట్టం
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ చట్టం
సి) 1956, 7వ రాజ్యాంగ సవరణ చట్టం
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ చట్టం

19. ప్రస్తుతం ఆస్తిహక్కును చట్టబద్ధమైన హక్కుగా మారుస్తూ ఏ అధికరణంలో పొందుపరిచారు?
ఎ) 31వ అధికరణం బి) 31(ఎ)వ అధికరణం
సి) 300వ అధికరణం డి) 300(ఎ)వ అధికరణం

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ



20. ఏ అధికరణం భారత పౌరులకు ఆరు రకాల ప్రాథమిక స్వేచ్ఛలను ప్రసాదిస్తుంది?
ఎ) 14వ అధికరణం బి) 17వ అధికరణం
సి) 19వ అధికరణం డి) 21వ అధికరణం

21. వాక్, భావప్రకటన స్వేచ్ఛలను ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 19(1-ఎ) బి) 19(1-బి) సి) 19(1-సి) డి) 19(1-డి)

22. చలనచిత్రాలు, వార్తాపత్రికలు, నవలలు ఏ అధికరణం ద్వారా భావప్రకటన వ్యక్త పరచవచ్చు?
ఎ) 18వ బి) 19(1-ఎ) సి) 21వ డి) 21(ఎ)

23. జీవించే హక్కు గురించి తెలిపే అధికరణం?
ఎ) 19వ బి) 20వ సి) 21వ డి) 22వ

24. ఏ ఒక్క పౌరుడిని 'చట్టం పేర్కొన్న పద్ధతి మినహా' మరోవిధంగా అతడి జీవనానికి, స్వేచ్ఛకు భంగం కల్గించరాదు అని తెలిపే అధికరణం?
ఎ) 21వ బి) 22వ సి) 23వ డి) 24వ

25. 6-14 ఏళ్లలోపు బాలబాలికలకు ఉచిత, నిర్బంధ విద్యను అందించాలని తెలిపే అధికరణం?
ఎ) 20వ బి) 20(ఎ) సి) 21వ డి) 21(ఎ)

26. ఏ రాజ్యాంగ సవరణ ద్వారా 21(ఎ) ఆర్టికల్‌ని రాజ్యాంగంలో చేర్చారు?
ఎ) 1976, 42వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 2001, 85వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ

27. నిర్బంధంలోకి తీసుకొన్న వ్యక్తిని 24 గంటల లోపు సమీప న్యాయస్థానం, న్యాయమూర్తి ముందు హాజరుపరచాలని తెలిపే అధికరణం?
ఎ) 20వ బి) 21వ సి) 22వ డి) 23వ

28. మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి వంటి అమానుష చర్యలు నిషేధమని తెలిపే ప్రాథమిక హక్కు?
ఎ) సమానత్వపు హక్కు బి) స్వాతంత్ర్యపు హక్కు
సి) మతస్వాతంత్ర్యపు హక్కు
డి) పీడనాన్ని నిరోధించే హక్కు

29. అస్పృశ్యత నివారణను తెలిపే అధికరణం?
ఎ) 17వ బి) 18వ సి) 19వ డి) 20వ

30. అమల్లో ఉన్న చట్టాన్ని అతిక్రమించనిదే ఏ ఒక్క వ్యక్తిని దోషిగా పరిగణించరాదని తెలిపే అధికరణం?
ఎ) 19వ బి) 20వ సి) 21వ డి) 22వ

31. అత్యవసర పరిస్థితి కాలంలో సైతం రద్దుకాని అధికరణలు?
ఎ) 17, 18 బి) 19వ సి) 20, 21 డి) 23, 24

32. స్త్రీలు, బాలబాలికల అక్రమ రవాణా నిరోధక చట్టాన్ని ఎప్పుడు రూపొందించారు?
ఎ) 1956 బి) 1975 సి) 1986 డి) 2002

33. ప్రభుత్వం నిషేధించిన సంస్థలు, సంఘాలను ఏర్పాటు చేసుకోరాదని తెలిపే అధికరణం?
ఎ) 19(1-ఎ) బి) 19(1-బి) సి) 19(1-సి) డి) 19(1-డి)

34. భారతదేశంలో ప్రధాని మొదలుకొని సామాన్య పౌరుడి వరకు చట్టం దృష్టిలో అందరూ సమానులే అని తెలిపే అధికరణం?
ఎ) 14వ బి) 15వ సి) 16వ డి) 17వ

35. 'అస్పృశ్యత' పదాన్ని ఉపయోగించరాదని ఏ హైకోర్టు తీర్పు ఇచ్చింది?
ఎ) మద్రాస్ బి) మైసూరు
సి) బొంబాయి డి) ఢిల్లీ

36. ఆయుధాలు ధరించకుండా, శాంతియుతంగా సమావేశాలను ఏర్పాటు చేసుకొనే స్వేచ్ఛను ఏ అధికరణం ద్వారా కల్పించారు?
ఎ) 19(1-ఎ) బి) 19వ సి) 19(1-బి) డి) 19(1-డి)

37. ప్రతి పౌరుడు భారతదేశంలోని ఏ ప్రాంతంలోనైనా స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ జమ్మూకశ్మీర్, గిరిజన ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోరాదు అని తెలిపే అధికరణం?
ఎ) 19(1-ఎ) బి) 19(1-సి) సి) 19(1-డి) డి) 19(1-ఇ)

38. మతవ్యాప్తి, మత అభివృద్ధికి ఖర్చు చేసిన వ్యయంపై పన్నులు చెల్లించనక్కరలేదు అని తెలిపే అధికరణం?
ఎ) 27వ బి) 28వ సి) 29వ డి) 30వ

39. మైనార్టీలు విద్యా సంస్థలను ఏర్పాటు చేసుకోవచ్చు అని తెలిపే అధికరణం?
ఎ) 30వ బి) 31వ సి) 31(ఎ) డి) 31(బి)

40. ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లినప్పుడు పౌరుడు ఏ అధికరణం ప్రకారం సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చు?
ఎ) 30వ బి) 31వ సి) 32వ డి) 33వ

41. ప్రాణరక్షణ గురించి తెలిపే ఆర్టికల్?
ఎ) 17వ బి) 19వ సి) 20వ డి) 21వ

42. ఆస్తి హక్కు(31వ అధికరణం)పై సవరణ, పరిమితులను విధించే అధికారం 368 అధికరణం ప్రకారం పార్లమెంట్‌కు లేదు అని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు ఇచ్చింది?
ఎ) గోలక్‌నాథ్ Vs పంజాబ్ (1967)
బి) కేశవానందభారతి Vs కేరళ(1973)
సి) మినర్వామిల్స్ Vs ఢిల్లీ(1980)
డి) ఎ.కె.గోపాలన్ Vs మైసూర్(1950)

43. నిర్బంధించిన వ్యక్తిని 24 గంటల్లోపు కోర్టుకు హాజరుపరిచే రిట్?
ఎ) హెబియస్ కార్పస్ బి) మాండమస్
సి) ప్రొహిబిషన్ డి) సెర్షియోరరీ

44. మత స్వేచ్ఛ గురించి తెలిపే అధికరణం?
ఎ) 23వ బి) 24వ సి) 25వ డి) 29వ

45. ఏ అధికరణం ప్రకారం బలహీన వర్గాలు తమ భాష, సంస్కృతులను పరిరక్షించుకోవచ్చు?
ఎ) 29వ బి) 30వ సి) 31వ డి) 32వ

46. పార్లమెంట్, శాసనసభ్యులు రూపొందించే చట్టాలు ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉంటే అవి చెల్లవని తెలిపే అధికరణం?
ఎ) 12వ బి) 13వ సి) 14వ డి) 15వ

47. నేరం రుజువు కానిదే శిక్ష విధించరాదని తెలిపే అధికరణం?
ఎ) 19వ బి) 20వ సి) 21వ డి) 22వ

48. సాయుధ దళాల ప్రాథమిక హక్కులపై ఎవరు షరతులు విధిస్తారు?
ఎ) రాష్ట్రపతి బి) రక్షణశాఖ
సి) సుప్రీంకోర్టు డి) పార్లమెంట్

49. అర్హత లేకుండా పదవిలో కొనసాగడాన్ని నివారించే రిట్?
ఎ) హెబియస్ కార్పస్ బి) మాండమస్
సి) ప్రొహిబిషన్ డి) కో-వారెంట్

50. భారత రాజ్యాంగ చరిత్రలో స్వేచ్ఛ హక్కుకు సంబంధించి తొలి కేసు?
ఎ) ఎ.కె.గోపాలన్ Vs మైసూరు(1950)
బి) మేనకాగాంధీ కేసు(1978)
సి) గోలక్‌నాథ్ Vs పంజాబ్(1967)
డి) కేశవానందభారతి Vs కేరళ(1973)

సమాధానాలు

1) ఎ	9) డి	17) బి	25) డి	34) ఎ	43) ఎ
2) సి	10) బి	18) బి	26) డి	35) బి	44) సి
3) సి	11) సి	19) డి	27) సి	36) సి	45) ఎ
4) డి	12) డి	20) సి	28) డి	37) డి	46) బి
5) ఎ	13) ఎ	21) ఎ	29) ఎ	38) ఎ	47) బి
6) బి	14) సి	22) బి	30) బి	39) ఎ	48) డి
7) సి	15) బి	23) సి	31) సి	40) సి	49) డి
8) ఎ	16) ఎ	24) ఎ	32) ఎ	41) డి	50) ఎ
			33) సి	42) ఎ	

ఉద్యోగాలు

ఐఐఎస్ఇఆర్‌బి

భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఇఆర్‌బి)- **నాన్ టీచింగ్ పోస్టుల** భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 10
పోస్టులు: డిప్యూటీ రిజిస్ట్రార్ 1, సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ 1, సైంటిఫిక్ ఆఫీసర్ (ఫిజిక్స్) 1, మెడికల్ ఆఫీసర్ 1, టెక్నికల్ సూపరింటెండెంట్ (కంప్యూటర్ సైన్స్) 1, సైంటిఫిక్ సూపరింటెండెంట్ (బయాలజీ) 1, అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) 1, టెక్నికల్ అసిస్టెంట్ 1, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ 1, ఆఫీస్ అసిస్టెంట్ (లీగల్) 1
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 8
వెబ్‌సైట్: http://recruitment.iiserb.ac.in/IIS-ERB

యూపీఎస్సీ

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 54
పోస్టులు - ఖాళీలు: అసిస్టెంట్ డైరెక్టర్ - కెమిస్ట్రీ 1, అసిస్టెంట్ ఇంజనీర్ 3, స్పెషలిస్ట్ గ్రేడ్ 3 అసిస్టెంట్ ప్రొఫెసర్ 37, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 6, డ్రిల్లర్ ఇన్‌ఛార్జ్ 5, లెక్చరర్ 2
అర్హత: పోస్టును అనుసరించి బిఇ/ బిటెక్/ ఎమ్మెస్సీ/ ఎంబిబిఎస్/ ఎండి/ ఎమ్మెస్/ డిఎం/ ఎంసిహెచ్ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత రంగంలో కనీసానుభవం ఉండాలి. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: www.upsconline.nic.in

నీతి ఆయోగ్

నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఆయోగ్ (నీతి ఆయోగ్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు:** 173
పోస్టులు - ఖాళీలు: అడ్వైజర్/ సీనియర్ అడ్వైజర్ 7, జాయింట్ అడ్వైజర్ (ఫ్లెక్సీబుల్) 19, డిప్యూటీ అడ్వైజర్ (ఫ్లెక్సీబుల్) 19, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ 28, రీసెర్చ్ ఆఫీసర్ (ఫ్లెక్సీబుల్) 28, ఎకనామిక్ ఆఫీసర్ (ఫ్లెక్సీబుల్) 28, ఎకనామిక్ ఆఫీసర్ 44
అర్హత: పోస్టును అనుసరించి పీజీ/ ఎంబిబిఎస్
వయసు: 26 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25, 2017
వెబ్‌సైట్: www.niti.gov.in

ఉత్తమ ఉద్యోగులు వీరే..

71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన ఉద్యోగులకు ఎక్సైజ్‌శాఖ మంత్రి పద్మారావు మంగళవారం అవార్డులు అందజేశారు. కొత్తగూడెం ప్రగతి మైదాన్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పద్మారావు ఈ అవార్డులను అందజేశారు. - ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం



ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

● ఇల్లెందులో రెండోరోజూ ఉట్ల వేడుకలు



కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



కృష్ణుడి వేషధారణలో చిన్నారి

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలో మంగళవారం సైతం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని జగదాంబ సెంటర్, షిరిడి సాయి మందిరం, భజనమందిరం వద్ద వేడుకలు జరిగాయి. యువకులు ఉట్లు కొట్టి వేడుకలు జరుపుకున్నారు. వేడుకల్లో వివిధ వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు. వివిధ పాఠశాలల్లో, కళాశాలల్లో ఉట్లు కొట్టే వేడుకలు, చిన్నారుల విచిత్ర వేషధారణలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఏరియాకు చెందిన లక్కినేని సమంత్ చిన్ని కృష్ణుడి వేషధారణతో ఆకట్టుకున్నాడు.

దేవస్థానంలో స్వాతంత్ర్య వేడుకలు

జెండా ఆవిష్కరించిన కార్యనిర్వహణాధికారి ప్రభాకర శ్రీనివాస్

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం కార్యాలయంలో కార్యనిర్వహణాధికారి కె.ప్రభాకర్ శ్రీనివాస్ 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా కార్యాలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థానం సిబ్బంది స్వాగతం పలికారు అనంతరం ఎస్టీఎఫ్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రామాలయానికి చెందిన అర్చకులు జాతీయ జెండా వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి జాతీయ జెండాను ఈవో ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడంలో కీలక పాత్రపోషించిన మహనీయుల గురించి వివరిస్తూ వరి ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు.



జాతీయజెండాకు వందనం చేస్తున్న ఈవో



మంత్రికి వెదురుతో తయారు చేసిన వస్తువును అందజేస్తున్న గిరిజన మహిళ



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి



సాంస్కృతిక వేడుకలను తిలకిస్తున్న మంత్రి, కలెక్టర్,ఎస్పీ, ఎమ్మెల్యే జలగం



వైద్య ఆరోగ్యశాఖ శకటం

తిరంగా.. మురవంగా..

- మురిసిన ముువ్వన్నెలు
- ఇరుజిల్లాల్లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం
- ఖమ్మంలో తుమ్మల జెండా ఆవిష్కరణ.. భద్రాద్రిలో పద్మారావు
- 'ఉత్తమ' ఉద్యోగులకు పురస్కారాలు

మువ్వన్నెలు మురిశాయి. అమరుల స్ఫూర్తి.. యువజనుల ఆర్తి సాక్షిగా రెపరెపలాడాయి. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మంగళవారం 71వ స్వాతంత్ర్య వేడుకలు అంబరాన్నంటాయి. ఖమ్మం జిల్లా పరేడ్‌గ్రౌండ్‌లో ఆర్‌అండ్‌బీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జాతీయజెండాను ఎగరేశారు. ఈసందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని ప్రగతి మైదానంలో ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు జెండాను ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం 'ఉత్తమ' ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.



ఉత్తమ పోలీసు అధికారికి ప్రశంసా పత్రం అందజేస్తున్న మంత్రి



జెండా ఎగురవేస్తున్న మంత్రి పద్మారావు



గాంధీజీ వేషధారణలో బాలుడు



మహిళా అధికారికి ప్రశంసా పత్రం అందజేస్తున్న మంత్రి



వైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి



భారతమాత వేషధారణలో విద్యార్థిని



జాతీయ జెండాతో చిన్నారి



విద్యార్థుల ప్రదర్శనలో దృశ్యం..



ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తూ..




నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



నృత్యం చేస్తున్న గిరిజన కళాకారులు



కొత్తగూడెంలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన



విద్యార్థుల ప్రదర్శన



విద్యార్థినుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న భద్రాచలం ఆర్డీవో



జెండాకు వందనం చేస్తున్న సింగరేణి సీఎండీ

ఖమ్మంలో జెండా పండుగ



జెండాకు సెల్యూట్ చేస్తున్న తుమ్మల



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి



స్వాతంత్ర్య సమరయోధులకు తుమ్మల సన్మానం



వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు



నృత్యం చేస్తున్న చిన్నారులు

విద్యార్థులు చదువుల్లో ఉన్నతంగా రాణించాలి

పాల్వంచ టౌన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువుల్లో ఉన్నతంగా రాణించాలని హైదరాబాద్‌లో పలు వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపార వేత్త పాతపాల్వంచ నివాసి, పూర్వ విద్యార్థి కూరపాటి విజయరామరాజు అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను చదివిన గురుకుల పేరున ప్రతి ఆగస్టు 15న పదిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందచేస్తున్నానన్నారు. కేటీపీఎస్ పాఠశాల విద్యార్థులకు కూడా అందించామన్నారు. 10/10 మార్కులు సాధిస్తే.. రూ. 5వేలు, గోల్డ్‌మెడల్ ప్రశంసాపత్రం కూడ అందచేస్తానని ప్రకటించారు.


పాల్వంచ మునిసిపల్ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న భాస్కర్‌గౌడ్


మహాత్ముడికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేత ఎడవెల్లి కృష్ణ


వేడుకల్లో పాల్గొన్న కార్మికనేత జలీల్


బీసీ సంఘ కార్యాలయం వద్ద..



ఏఐటీయూసీ కార్యాలయం వద్ద...

ఎల్లెడలా జెండా పండుగ

పాల్వంచ పట్టణం, పారిశ్రామిక ప్రాంతంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రముఖ సెంటర్లు, కార్మిక ప్రాంతాల్లో నాయకులు, ప్రముఖులు, కార్మికసంఘాల నేతలు జాతీయజెండాలను ఆవిష్కరించారు.

పాల్వంచ టౌన్: మునిసిపల్ కార్యాలయంలో 71వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ మునిసిపల్ కమిషనర్ బి. భాస్కర్ గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు.

● విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘభవనం వద్ద కట్టా రామలింగేశ్వరరావు పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

● ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో బుద్దిరాజు విశ్వం పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మానస అకాడమి డైరెక్టర్ ప్రభుకుమార్, ప్రెస్‌క్లబ్ కన్వీనర్ అబ్బురాం, కోశాధికారి జీ. వీరభద్రం, సీనియర్ జర్నలిస్టులు చంద్ర నర్సింహారావు, వేముల కొండలరావు, ఎస్‌కె. సుబాని, గగనం శ్రీనివాస్, ఇ.రఘు, బి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● బాపూజీనగర్ మహాత్మాగాంధీ పౌండేషన్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. వర్తక సంఘం కన్వీనర్ జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం మిఠాయిలుపంచారు.

● న్యూలైఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రీనివాసులు జెండా ఆవిష్కరణ చేశారు.

● లయన్స్‌క్లబ్ ఆఫ్ పాల్వంచ గోల్డ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు ఎడవల్లి కృష్ణ, సభ్యులు మార్కెట్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● త్రివేణి పాఠశాలలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు సుధాకర్‌రావు జెండా ఆవిష్కరణ చేశారు.

● స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సీపీఐ, ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు భవన నిర్మాణం సంఘం, కార్పెంటర్స్ సంఘం, పేయింటర్స్ సంఘం, గుడిసె వాసుల సంఘం తదితర సంఘాల ఆధ్వ ర్యంలో జాతీయ జెండాలను ఎగురవేసి ఆవిష్కరించారు.

పరిశ్రమల వద్ద స్వాతంత్ర్య వేడుకలు

కేటీపీఎస్(పాల్వంచ): పాల్వంచలోని పలు పరిశ్రమల వద్ద త్రివర్ణపతాకాలు రెపరెపలాడాయి. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ కాంప్లెక్స్‌తో పాటు నవభారత్ లోని ఎన్ఎండీసీ (స్పాంజ్‌ఐరన్), నవభారత్ కర్మాగారాలవద్ద అధికారులు పతాకాలను ఎగురవేశారు. కేటీపీఎస్ ఓఅండ్ఎం వద్ద చీఫ్ ఇంజనీర్ జాటోత్ సమ్మయ్య, ఐదు,ఆరుదశల వద్ద చీఫ్ ఇంజనీర్ టీఎస్ఎన్ మూర్తి, శిక్షణా కేంద్రం వద్ద చీఫ్ ఇంజనీర్ భూక్యా బిచ్చన పతాకాలను ఎగురవేసిన అనంతరం మాట్లాడారు. విద్యుత్ రంగంలో జాతీయ స్థాయి గుర్తింపు పొందిన జెన్కోకు మరింత పరిపుష్టిని తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కేటీపీఎస్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. నవభారత్ వద్ద సంస్థ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసమూర్తి, ఎన్ఎండీసీ ప్రాజెక్టు ఆఫీసర్‌శర్మ పతాకాలను ఆవిష్కరించారు.

● కేటీపీఎస్‌లోని యూనియన్ కార్యాలయాలవద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. 1535 కార్యాలయం వద్ద రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ వజీర్, 1104 వద్ద రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ సుధీర్, 327వద్ద రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాదం రామకృష్ణారావు, హెచ్ 64 కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ దుర్గాఅశోక్, టీఎన్‌వీకేఎస్ కార్యాలయం వద్ద బొల్లేపల్లి రాంబాబు, బీసీ ఉద్యోగుల సంఘ కార్యాలయం వద్ద రాష్ట్ర అధ్యక్షుడు కొమరవెల్లి రవీందర్, టీఆర్‌వీకేఎస్ కార్యాలయం వద్ద నాయకులు తదితరులు పతాకాలు ఎగరేశారు. టీఎం జేఏసీ కార్యాలయం వద్ద కలకోల శ్రీనివాస్, టీఆర్‌పీఈయూ కార్యాలయం వద్ద అధ్యక్షుడు దాసరి వెంకటయ్య జెండా ఆవిష్కరించారు.

పాల్వంచ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పాల్వంచలో ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి వనమా వెంకటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఎడవల్లి కృష్ణ, పలు ప్రాంతాల్లో పతాకాలను ఆవిష్కరించారు. టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎం రాజుగౌడ్, నటరాజ్ సెంటర్‌లో సీనియర్ నాయకులు కిలారు నాగేశ్వరరావు, టీడీపీ కార్యాలయం వద్ద పట్టణ అధ్యక్షుడు జీవీ కృష్ణారావు, ఎంపీపీ భూక్యా అరుణ పాల్గొన్నారు. అల్లూరి సెంటర్ వేడుకల్లో మండల అధ్యక్షుడు వైఆర్‌కే నాయుడు పాల్గొన్నారు.


వేడుకల్లో ప్రసంగిస్తున్న వనమా


జెండా ఆవిష్కరించిన కిలారు


జెండా ఆవిష్కరణలో రాజుగౌడ్


పతాకాన్ని ఎగురవేస్తున్న కృష్ణారావు


వేడుకల్లో పాల్గొన్న నాయుడు

సినిమాలు

కొత్తగూడెం

- దుర్గా: ఫిదా
- పూర్ణ: జయ జానకీ నాయక
- పరమేశ్వరి: లై
- విశ్వరూప: వాసుకి
- మహేశ్వరి: నేనే రాజు.. నేనే మంత్రి

పాల్వంచ

- వెంకటేశ్వర జయ జానకీ నాయక
- వేణుగోపాల్ నేనే రాజు.. నేనే మంత్రి
- శాంతి లై

ప్రధాన ఆసుపత్రి

సూపరింటెండెంట్
డాక్టర్ జనార్దన్ 8008553195
బుధవారం డ్యూటీ డాక్టర్
మాలతీక్రిష్టిన

గ్యాస్ సమాచారం

కొత్తగూడెం ఇండియన్ గ్యాస్ గోడౌన్ నుంచి 14న గ్యాస్ బుక్ చేసుకున్న వారికి 21న సిలిండర్ అందజేస్తారు.
గ్యాస్ ఆన్‌లైన్ బుకింగ్ 9848824365

రైతు బజార్ ధరలు

కిలోకి (రూ.ల్లో)			
టమోట	50	క్యాబేజీ	30
పచ్చిమిర్చి	50	ఉల్లిగడ్డలు (రైతుబజారు)	32
వంకాయ	40	గోరుచిక్కుళ్లు	30
బెండకాయ	40	చామగడ్డ	50
కాకరకాయ	40	అలుగడ్డ	20
బోడకాకర	180	క్యారెట్	80
బీరకాయ	30	తెల్లవంకాయ	30
దొండకాయ	15	తోటకూర	4
చిక్కుళ్లు	40	కొత్తిమీర	20
దోసకాయ	20	చుక్కకూర	3
సొరకాయ	12	బచ్చలకూర	3

పోలీస్ సమాచారం

- డీఎస్పీ 9440795310
- వన్‌టౌన్ సీఐ 9440795314
- టు టౌన్ సీఐ 9440904304
- త్రీ టౌన్ సీఐ 9440904305
- ఓఎస్‌డీ 9440795302

మీ సేవలు మరువలేనివి...

● డాక్టర్ విజయ్‌కుమార్‌కు నేతల ఘన నివాళులు

కొత్తగూడెం టౌన్: వైద్య రంగంలో కొత్తగూడెం పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలకు విజయ్‌కుమార్ అందించిన వైద్యసేవలు మరువలేమని పలువురు నేతలు కొనియాడారు. రోడ్డుప్రమాదంలో మృతిచెందిన వైద్యుడు మద్దికాయల విజయ్‌కుమార్ భౌతికాయాన్ని పలువురు నాయకులు మంగళవారం సందర్శించి ఘన నివాళులర్పించారు.

వైద్యులు మద్దికాయల విజయ్‌కుమార్ మరణం వైద్యశాఖకు తీరని లోటని, వైద్యశాఖలో రాలిన ధ్రువతార విజయ్ కుమార్ అని ఎమ్మెల్యే జలగం వెంకటరావు కొనియాడారు. మంగళవారం కొత్తగూడెం హర్ష మెటర్నిటీ హాస్పిటల్‌లో డాక్టర్ విజయ్ కుమార్, అత్త సావిత్రిబాయి భౌతికాయలపై పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

విజయ్‌కుమార్ మృతి వైద్యశాఖకే తీరని లోటని మాజీమంత్రి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మృతుల భౌతికాయలను వనమా దంపతులు సందర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. పేద, మధ్య తరగతి వర్గాలకు సుదీర్ఘకాలంగా సేవలందించిన మహానీయుడు, ఉత్తమ వైద్యుడు విజయ్ కుమార్ అని కూనంనేని సాంబశివరావు అన్నారు. నివాళులు అర్పించిన వారిలో ఆయన వెంట సాబీర్‌పాషా, వై. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు కుటుంబంలో కమ్యూనిష్టు నేత ఓంకార్ తనయుడు డాక్టర్ విజయ్ కుమార్ వైద్య వృత్తికే వన్నె తెచ్చారని, ఆయన మృతి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి కాసాని ఐలయ్య అన్నారు. విజయ్‌కుమార్, అత్త సావిత్రిబాయి భౌతికాయాలను సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జలగం, మాజీమంత్రి వనమా దంపతులు

వైద్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతుల పంపిణీ

జూలూరుపాడు: వైద్యశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు మంగళవారం బహుమతులను అందజేశారు. ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వ్యాసరచనలో కేజీవీబీ విద్యార్థిని ఇ.లత ప్రథమ, జడ్పీహెచ్ఎస్‌కు విద్యార్థి ద్వితీయ, కేజీవీబీ విద్యార్థిని యు.ఉష తృతీయ స్థానాలలో నిలిచారు. వక్తృత్వ పోటీలలో జూలూరుపాడు విద్యార్థి పవన్ కళ్యాణ్, కేజీవీబీకి చెందిన బి.శ్వేత, జడ్పీహెచ్ఎస్‌కు చెందిన డి.మధు వరుస బహుమతులను సాధించారు. విజేతలకు సర్పంచ్ పాయం వెంకటరమణ, వైద్యులు గీత, శ్రీధర్‌లతో పాటు, టీఆర్ఎస్ జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ కాశిమళ్ళ మాధవి బహుమతులను అందజేశారు.


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే జలగం


జెండా ఆవిష్కరిస్తున్న కూనంనేని


టీడీపీ కార్యాలయంలో...



ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

జెండా ఊంచా రహే హమారా..

ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో జాతీయజెండా ఆవిష్కరణ

కార్మికవాడల్లో మువ్వన్నెల రెపరెపలు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

డివిజన్ వ్యాప్తంగా పంద్రాగస్టు వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, స్వచ్ఛంద, యువజన సంఘాలు, రాజకీయపార్టీల ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు, ప్రతినిధులు జాతీయజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో స్వాతంత్ర్య పోరాట జాతినేతల ఆశయసాధన కోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. మహనీయులను స్మరిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వేడుకల్లో భాగంగా ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

కొత్తగూడెం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు నాయకత్వంలో కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మువ్వన్నెల జెండాను ఎగురవేసి అనంతరం పట్టణంలో ఉగ్రవాద వ్యతిరేక ర్యాలీని నిర్వహించారు. సమగ్రత సమైక్యతకు పాటుపడాలని కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. దేశం కోసం స్వాతంత్ర్యం సిద్ధించడం కోసం ప్రాణాలను త్యాగం చేసిన మహనీయులను స్మరించుకుని ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వనమా రాఘవేంద్ర రావు, ఎంఎ. రజాక్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాసుల ఉమారాణి, జడ్పీటీసీ గిడ్ల పరంజ్యోతి, కాసుల వెంకట్, ఎస్‌కే. అన్వర్ పాషా, బత్తుల వీరయ్య, తోట దేవి ప్రసన్న, కే. రామస్వామి, తాటి పద్మ, సకినాల వెంకన్న, జోగ కృష్ణ, అమితాబచ్చన్, సీతారాములు, అచ్చె నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

● సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలో పలు ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూనంనేనిమాట్లాడారు. స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు గడిచిందని, రాష్ట్రం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నప్పటికీ స్వాతంత్ర్య ఫలాలు తెలంగాణ ఉద్యమ ఫలాలు పేదల దరి చేరలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబిర్ పాషా, నాయకులు బందెల నర్సయ్య, వై. శ్రీనివాసరెడ్డి, చంద్రగిరి శ్రీనివాస్, దుర్గరాశి వెంకన్న, సర్పంచ్ లక్ష్మీ గోవింద్, వాసిరెడ్డి మురళీ, రాధాకృష్ణమూర్తి, పరమేష్, డి. కృష్ణ పాల్గొన్నారు.

● స్వాతంత్ర్య వేడుకలను జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎడవల్లి కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక పాలకేంద్రం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించి పలు చోట్ల జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓంపల్లి ప్రకాష్, జక్కం సీతయ్య, తురక లక్ష్మయ్య, శివ, ఏలూరి రాజేష్ కుమార్, చంటి, నవతన్, దొడ్డ చంద్ర, తేజ, శ్రీను, ఆంగోతు గణేష్, మోహన్, మణికంఠ, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయంలో జాతీయజెండాను ఆవిష్కరించి మహనీయులకు దేశ త్యాగధనులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా నాయకులు కోనేరు పూర్ణచందర్‌రావు మాట్లాడారు. ఒకవైపు మహాత్మ గాంధీ అహింస, సత్యాగ్రహ ఉద్యమాన్ని అనుసరిస్తే.... మరోవైపు బ్రిటీషు దొర తనాన్ని ధిక్కరించి వీరోచితంగా పోరాడిన సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతరామరాజు లాంటి దేశ నాయకులను స్మరించుకోవాలని, వారి త్యాగాలను ఎన్నటికీ మరవరాదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ రావి రాంబాబు, గుగులోతు కృష్ణ, స్టీవెన్, ఎండీ. సర్వర్ పాషా, గోలి శ్రీను, కోటయ్య, కృష్ణమూర్తి, ఐలయ్య, రాంచందర్, ఏవీ. చారి, సాంబ, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు యెర్రా కామేష్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పలు ప్రాంతాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జల్లారపు శ్రీనివాసరావు, పదాల భాస్కర్, ఎ. రాములు, మహేంద్ర, శంకర్, బంటు నరేందర్, రావుల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కొత్తగూడెం పట్టణం, రూరల్ ప్రాంతాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ డిపార్ట్‌మెంట్ కన్వీనర్ జేబీ. శౌరి, జిల్లా నాయకులు మోత్కూరి ధర్మారావు, బొమ్మిడి రమాకాంత్, తేజావత్ వీరమ్మ, రతన్ నాయక్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

● జమాతే ఉల్మాయే హింద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాత డిపో నుంచి రైల్వే స్టేషన్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు ముహమ్మద్ జుబేర్ అహ్మద్ మాట్లాడారు. దేశం కోసం ఎందరో మహనీయులు ప్రాణాలను త్యాగం చేశారన్నారు. ఆ శాఖ జిల్లా కార్యదర్శి మౌలానా ఇనాయతుల్లా, మౌలానా అబ్దుల్ కరీం, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబిర్ పాషా, ప్రముఖ వేద పండితులు రమణ శర్మ, సీఎస్ఐ చర్చి ఫాస్టర్ రాజ్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

● కొత్తగూడెంక్లబ్‌లో స్వాతంత్ర్యవేడుకలను ఘనంగా జరుపుకున్నారు. క్లబ్ కార్యదర్శి వాసిరెడ్డి రమేష్‌బాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పలివెల సాంబశివరావు, వైవీ. రమణారావు, అశోక్ కుమార్ రాఠీ, మేక సురేష్‌బాబు, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ వీ. ఉపేందర్‌రావు, మల్సూర్, తదితరులు పాల్గొన్నారు.

● గాంధీ పథం ఆధ్వర్యంలో త్రీ ఇంక్లైన్ సమీపంలోని రేడియో స్టేషన్, వెంగళరావుకాలనీలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గాంధీ పథం ట్రస్ట్ సభ్యులు చింతల చెర్వు గెర్షోం, లక్ష్మక్క, కుసుమా, సరళ, వీరన్న, పుష్పమ్మ, జ్ఞాన వినోదిని పాల్గొన్నారు.

● చుంచుపల్లి పంచాయతీ కార్యాలయంలో 71వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. పంచాయతీ సర్పంచ్ బానోతు లక్ష్మీ గోవింద్ జాతీయ జెండాను ఆవిష్కరించి మహనీయుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ వార్డు సభ్యులతో ప్రభుత్వ ప్రతిజ్ఞలు చేయించారు. ఈ కార్యక్రమాల్లో ఈఓ అరుణ్ గౌడ్, ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళీ, ఎంపీటీసీ దుగ్గిరాశి వెంకన్న, జకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

● 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. సీతంపేట బంజర మండల ప్రజా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల దేశ నాయకుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

● పట్టణంలోని శ్రీ రాగా, వివేకవర్ధని, శ్రీ విద్య, గౌతమ్ మోడల్ స్కూల్, సూర్యోదయ, ఎస్ఆర్ డీజీ, శ్రీ నిధి, త్రివేణి తదితర పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు మహిళల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

జూలూరుపాడు మండలంలో..

జూలూరుపాడు: 71వ స్వాతంత్ర్య వేడుకలను మండల వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జక్కని స్వర్ణ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మూడు చిట్టిబాబు, పోలీస్‌స్టేషన్‌లో సీఐ సంపత్‌కుమార్, అటవీరేంజ్ కార్యాలయంలో ఎఫ్ఆర్‌వో నాగసాయిప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఏవో కార్యాలయం వద్ద ఏవో నారెడ్డి తిరుపతిరెడ్డి, ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏఈ ప్రతాప్‌కుమార్, మండల వనరుల కేంద్రంలో ఎంఈవో జి.వెంకట్, సొసైటీ కార్యాలయం వద్ద అధ్యక్షుడు పిజి.కృష్ణమూర్తి జాతీయ పతాకాలను ఎగరవేశారు. మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీ కార్యాలయాల్లో, పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు, బ్యాంకుల వద్ద అధికారులు, చంద్రుగొండ, పాపకొల్లు ఆటో అడ్డాల వద్ద ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు జాతీయజెండాలను ఆవిష్కరించి మాట్లాడారు.


బీజేపీ నాయకుల జెండా ఆవిష్కరణ


చుంచుపల్లిలో..


చిరు యూత్ ఆధ్వర్యంలో..


కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో


జూలూరుపాడులో..

మునిసిపాలిటీ 'పారిశుధ్య విభాగం' సమాచారం

1.	కమిషనర్ రవిబాబు(ఫిర్యాదుల కోసం)	9849905883
2.	మేనేజర్ నూరల్‌నజీబ్ (ఫిర్యాదు కోసం)	7702007775
3.	రవీందర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్	9666104016
4.	శ్రీనివాస్ (1 నుంచి 12 వార్డులు)	9849667031
5.	అంజాద్ (13 నుంచి 24 వార్డులు)	9290769614

ఇల్లెందు సినిమాలు

కళాంజలి	- ఫిదా
లలిత్ కళామందిర్	- జయ జానకి నాయక
శ్రీ సీతారామ	- నేనే రాజు నేనే మంత్రి

మువ్వన్నెల రెపరెపలు

ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు ● టేకులపల్లిలో ఎమ్మెల్యే కోరం కనకయ్య పతాకావిష్కరణ


పతాక ఆవిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే


జెండా ఆవిష్కరిస్తున్న దిండిగాల


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఇల్లెందు: 71వ స్వాతంత్ర్య దిన సంబురాలు మంగళవారం ఇల్లెందులో ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రవేట్, సింగరేణి కార్యాలయాల్లో, విద్యాలయాల్లో, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో మువ్వన్నెల పతాకాలు రెపరెపలాడాయి. వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు పట్టణంలోని వివిధ కూడళ్లల్లో త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించాయి. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య టేకులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. న్యాయస్థానంలో మెజిస్ట్రేట్ శ్రీనివాసరావు, ఇల్లెందు మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మడతరమావెంకట్‌గౌడ్, పోలీస్ సబ్‌డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ ప్రకాశ్‌రావు, తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ కే. శ్రీనివాసులు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కనకదుర్గ, పోలీస్‌స్టేషన్‌లో సీఐ డీ, వేణుచందర్, ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో డీఈ వాసిరెడ్డి వెంకటేశ్వర్‌రావు, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌వద్ద టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఉపాధ్యక్షుడు ఎస్‌డీ. మహబూబ్, ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ చిన్ని కృష్ణ, ప్రెస్‌క్లబ్‌లో అధ్యక్షుడు సూర్ణపాక శోభన్‌బాబు పతాకాలను ఆవిష్కరించారు. పట్టణంలోని వివిధ సెంటర్లల్లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే. జానీ, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ముద్రగడ వంశీ, బీజేపీ నేత నాళ్ల సోమసుంధర్ తదితరులు త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు. సింగరేణి పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లు గౌరవ వందనం సమర్పించారు. వివిధ పాఠశాలల్లో, కళాశాలల్లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ సంబురాల్లో విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించిన శానిటరీ సిబ్బందిని స్వచ్ఛభారత్ ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

టేకులపల్లి: మండల వ్యాప్తంగా స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యాలయాల్లో, పలు పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. టేకులపల్లి పోలీసు స్టేషన్‌లో సీఐ దోమల రమేష్, బోడు పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ అనిల్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అంజంరాజు, మండల పరిషత్ కార్యలయంలో ఎంపీపీ భూక్యా లక్ష్మీ, సొసైటీలో అధ్యక్షుడు పూన్యా నాయక్, ప్రభుత్వ కాలేజిలో ప్రిన్సిపాల్ కల్పనలు జెండాలను ఎగురవేశారు. టీఆర్ఎస్ మండల కార్యాలయంలో జడ్పీటీసీ సభ్యుడులక్కినేని సురేందర్‌రావు, ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు కభంపాటి చంద్రశేఖర్‌రావు, కాంగ్రెస్ దిమ్మె వద్ద గుండా నర్సింహారావు, దళ్‌సింగ్‌లు జెండాలను ఆవిష్కరించారు.


మునిసిపాలిటీ భవనంలో...


ఇల్లెందు ఎంపీడీవో కార్యాలయంలో


సబ్‌డివిజన్ కార్యాలయంలో


తహసీల్దార్ కార్యాలయంలో..


ప్రశంసాపత్రాలతో మునిసిపల్ సిబ్బంది


టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో..


టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌లో..

'హమాలీలకు సమగ్ర చట్టం చేయాలి'

ఇల్లెందుటౌన్: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించాలని ఇఫ్టూ అను బంధ హమాలీ మిల్ వర్కర్స్ యూనియన్‌ఉమ్మడి జిల్లాల కార్యదర్శి ఎస్‌కే. మదార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇల్లెందు ఇఫ్టూ కార్యాలయంలో జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షులు పి. లింగయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికులకు నేటివరకు సమగ్ర చట్టం లేకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరం బరువులు మోస్తూ పనిచేస్తున్నప్పటికీ ప్రమాదం జరిగితే ఎలాంటి వైద్యసదుపాయాలు కల్పించడంలేదన్నారు. దేశంలో, రాష్ట్రంలో హమాలీ కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21 నుంచి 23వరకు జిల్లాలో మండల కేంద్రాల్లో ప్రదర్శనలు, దర్నాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బోడ మంచ, ఎస్‌కే. జానీమియా, మాలోత్ సూర్య, రామ్మూర్తి, లింగయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మదార్

మాణిక్యారం పాఠశాలకు బెంచీల అందజేత

ఇల్లెందురూరల్: తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలను అర్పించిన తెలంగాణ ఉద్యమకారుడు రాంటెంకి శ్రీకాంత్ జ్ఞాపకార్థం మండలంలోని మాణిక్యారం ప్రాథమికోన్నత పాఠశాలకు బెంచీలను వితరణగా అందించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ అమరుడు రాంటెంకి శ్రీకాంత్ తల్లి దండ్రులు రాంటెంకి సమ్మయ్య, రాధల ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీటీసీ చంద్రఅరుణ, ఎంపీడీవో కనకదుర్గలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మోకాళ్ళకృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ జనగంకోటేశ్వర్‌రావు, పీఏసీఎస్ అధ్యక్షులు ఆవులకిరణ్, ఎంపీటీసీ రాంటెంకి వెంకటేశ్వర్లు, ఎస్ఎంసీ చైర్మెన్ భద్రయ్య పాల్గొన్నారు.


బెంచిలు అందిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య జన్మదిన వేడుకలు

ఇల్లెందుటౌన్: సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్రవెంకటవీరయ్య జన్మదిన వేడుకలను మంగళవారం ఇల్లెందులో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ముద్రగడ వంశీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ టీడీపీ నేతగా, సత్తుపల్లి ఎమ్మెల్యేగా సండ్ర వెంకటవీరయ్య అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని వెల్లడించారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో టీడీపీ పూర్వ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అయ్యోరి నాగరాజు, కారు నర్సన్న, కొండమల్ల కృష్ణ, దేశావత్‌శ్రీహరి, సాల్మన్ రాజు, మైప బాలరాజు, ఎస్‌కే. ఖాసీం, కల్లెపల్లి విజయ్, కోడేపాక సంపత్, దాసరి గోపాలకృష్ణ, చాందావత్ రమేష్‌బాబు, గొగ్గెల రాజేష్, శ్రీవేద్, కే. మహేష్, సీహెచ్ చంద్రయ్య, ఢీకొండ రాజారావు, ఎస్‌కే. పాష, బోలం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కేక్ తినిపిస్తున్న ముద్రగడ వంశీ

రేపు ఏఐఎస్ఎఫ్ పట్టణ, మండల మహాసభ

ఇల్లెందుటౌన్: అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) పట్టణ, మండల మహాసభ ఈ నెల 17న ఇల్లెందులో నిర్వహిస్తున్నట్లు సంఘం పట్టణ కార్యదర్శి కే. సాయిశషాంక్, సీహెచ్. ప్రసాద్ తెలిపారు. మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య కోసం తమ సంఘం అనేక పోరాడాలు, ఆందోళనలు చేస్తుందన్నారు. విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఏజన్సీ పాఠశాలను మూసివేసేందుకు చేపడుతున్న చర్యలను విరమించుకోవాలన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'గ్రామ పూజారులను ప్రభుత్వం ఆదుకోవాలి'

టేకులపల్లి: నిత్యం కులదైవాలను ఆరాదించే గ్రామ పూజారులను ప్రభుత్వం ఆదుకోవాలని జేఎంబీ గిరిజన సేవాసంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసం విజయ కుమారి డిమాండ్ చేశారు. టేకులపల్లిలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ పూజారులు, శివసత్తులు, దేవరబాలలకు దూపదీప నైవేద్యం కింద నెలకు రూ.10వేలు ఇవ్వాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో జేఎంబీ నాయకులు రాంబాయి, మాన్‌సింగ్, బుచ్చమ్మ, కుంజా కోటమ్మ, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై 21న సమావేశం

ఇల్లెందు: సింగరేణి కాలరీస్ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల షెడ్యూల్డ్ ఖరారు చేసేందుకు ఈ నెల 21న సమావేశానికి హాజరుకావాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్(సెంట్రల్) శ్యాంసుంధర్ కోరారు. తొలుత ఈ సమావేశాన్ని హైదరాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసినప్పటికీ కాంట్రాక్ట్ కార్మికులు పెద్దఎత్తున ఆందోళనలకు పూనుకోవడంతో సమావేశం జరుగలేదు. ఈ మేరకు సమావేశాన్ని ఈ నెల 21న హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఏర్పాటు చేస్తూ కార్మిక సంఘాలను, సింగరేణి ఉన్నతాధికారులను హాజరు కావాలని ఆయన కోరారు.